కాలజ్ఞానసుధ
ఆధ్యాత్మిక మాస పత్రిక

ఆగస్టు - 2015 సంపుటి:19 సంచిక:8



ఈ నెల సూక్తి

 విష పదార్థం వుంచిన పాత్ర ఆహార నిల్వకు పనికిరానట్లే, ద్వేషభావంతో నిండిన హృదయం పరమాత్మ సేవకు పనికిరాదు



# విషయ సూచిక

| | |
|---|---|
| అతిథిదేవోభవ | 4 |
| మనసుకు నిద్ర - శరీరానికి ఆరోగ్య ముక్తి | 6 |
| సనాతన ధర్మము - దాని విశిష్టత (పాలక ధర్మములు) | 10 |
| వేదపరిచయము | 13 |
| పరమశివుని గెలిచిన పిసినారి | 16 |
| వీరకాళికాంబా శతకము | 18 |
| ఆది గురువు ఆచార్య శంకరులు | 19 |
| యోగవాసిష్ట కథాలహరి - ప్రహ్లాదుని ఆత్మ ప్రస్థానం | 22 |
| భగవద్గీతకు భాసురభాష్యం | 24 |
| యజ్ఞాలు - భారతీయత | 27 |
| శ్రీరామ భక్తి ( వశిష్ఠ మహర్షి శ్రీరామభక్తి) | 29 |
| రఘువంశం | 31 |
| దర్శనీయ దేవాలయాలు-చారిత్రక ప్రదేశాలు (బ్రహ్మసంవేద్యం) | 34 |
| వివిధ వ్యాధులు ఆయుర్వేద చికిత్సలు | 35 |
| వాస్తు - సైన్సు | 37 |

ముఖచిత్రం: లక్ష్మీదేవి, విష్ణుమూర్తి

చందా వివరములు

జీవిత చందా (20సం॥) : 1116/-
సంవత్సర చందా : 70/-

చందాలు పంప వలసిన చిరునామా:
కాలజ్ఞాన సుధ
శ్రీ అచలానంద ఆశ్రమము, 8-202(1), మంగమూరు రోడ్డు,
ఒంగోలు - 523 002 ప్రకాశం జిల్లా, (ఆం. ప్ర)
ఫోన్స్: 08592/235341, 9949132469,
9705555229, 8977799289

సంపాదకులు: శ్రీ పరిపూర్ణ సిద్ధానందస్వాములవారు

# అతిధిదేవోభవ

సేకరణ, రచన : శింగల్‌రెడ్డి ఈశ్వరరెడ్డి,యం.ఏ బ్రహ్మంగారిమఠం, సెల్ : 9440426300

భక్త కభీరును గురించి తెలియనివారుండరు. నిరంతరము రామనామ చింతనలో తధాత్మ్యభావనతోయుండును. ఆ కబీరునకు తల్లిదండ్రులు తగిన సమయములో వివాహము చేసిరి. అయినను సంసారమున చిక్కుకొనకుండా రామనామ సంకీర్తనతో ఆనందపరవశత్వము చెందుచుండెను. లోకులు అతనిని పిచ్చివాడుగా భావించిరి.

కొంతకాలమునకు కబీరు భార్య గర్భవతియై ఒక కుమారుని ప్రసవించినది. అతనికి 'కమాల్' అని పేరు పెట్టిరి. పెరిగి పెద్దయగుచున్న ఆ బాలుడుకూడా తండ్రి వలె రామనామ సంకీర్తన నిరంతరము చేయుచుండెను. ఆరు సంవత్సరములప్రాయమున కమాల్ తీర్థయాత్రలు చేయాలనుకున్నాడు. తండ్రి అనుమతి కోరాడు. తండ్రి సంతసించి అనుమతించాడు.

కమాల్ రామనామమును జపిస్తూ అనేక దివ్యక్షేత్రములను దర్శించెను. ఈ బాలుని చూసిన భగవద్భక్తులు తమయింటికి అతిథిగా తీసికొనిపోయి సకల పరిచర్యలు చేసెడివారు. అలా ద్వారక చేరుకున్న 'కమాల్' అక్కడే విష్ణుభక్తులతో కలిసి రామనామ సంకీర్తన చేయుచు ఆనందించెను. ఒకరోజు విష్ణుదాసు అనువర్తకుడు 'కమాల్' భక్తికి మెచ్చి తనయింటికి ఆహ్వానించి పూజించెను. కోరికలే లేని కమాల్‌కు ఒక అమూల్యరత్నమును బహుకరించెను. కటికచీకటిలో ప్రకాశించు ఆ రత్నము గొప్పదనము తెలిపెను. ఆ రత్నమును తీసికొని వెళ్లిన తన తండ్రి సమ్మతించడని, తెలిపి రత్నము తీసికొనుటకు నిరాకరించెను. వర్తకుడు చివరకు కమాలునకు తెలియకుండా ఆ రత్నమును అతని వస్త్రము కొంగునకు ముడివేసెను.

కమాల్ తిరుగు ప్రయాణమయ్యాడు. మార్గమధ్యంలో తన కొంగుకు ఉన్న రత్నమును చూచెను. ప్రీతితో వర్తకుడు తనకు కానుకగా ఇచ్చెనని భావించెను. గృహమును చేరి తండ్రికి సాష్టాంగ నమస్కారము చేసి ఆ రత్నమును ఆయన పాదముల వద్ద నుంచెను. కబీరు చాలా బాధపడి దుఃఖపడెను. తీర్థయాత్ర నుండి వచ్చిన కుమారుని చూచి సంతసించక ఏల బాధపడుచున్నాడని కబీరు భార్య కారణ మడిగెను. తమ కుమారుడు రామనామమును వెలకట్టి ఈ రత్నమును పొందెనని తెలిపెను.. కమాల్ తన తప్పును తెలిసికొని తిరిగి వెళ్లి విష్ణుదాసు వర్తకునకు రత్నమును తిరిగి ఇచ్చివేసెను.

ఒకరోజు కొందరు భక్తులు యాత్రలు చేస్తు రాత్రి సమయమున కబీరు ఇంటికి వచ్చిరి. వారికి అతిధి సత్కారములు చేసి కూర్చుండబెట్టిరి కాని వారికి భోజనము సమర్పించుటకు వారి ఇంట, బియ్యము కాని పప్పుదినుసులుకాని లేవు. అది తెలిసికన్న కబీరు, కమాల్ అతిధులకు ఏ విధముగానైనా భోజనము

పెట్టాలని చివరకు అంగడి నుండి సరుకులు దొంగతనము చేసి తెచ్చుటకు నిశ్చయించుకొనిరి.

అంగడికి కన్నమువేసి కమాల్ లోనికి ప్రవేసించి తమకు అవసరమైనన్ని భోజన పదార్థములను తండ్రిచేతికి అందించెను. తాము వెళ్లిన తరువాత ఇతరులెవరైనా ఆకన్నముగుండా వచ్చి దొంగతనము చేసిన వర్తకడు నష్టపోవునుగదాయని అతనిని మేల్కొల్పెను. తాను కన్నము గుండా బయటకు పోవుటకు ప్రయత్నించగా వర్తకుడు కమాల్ కాళ్లుపట్టుకొనును. తాను చిక్కునని భావించి తండ్రితో యిలా అన్నాడు. నాన్నగారు నేను ఇతనికి చిక్కి దండనము తప్పదు. దొంగతనము చేసినందుకు మన పరువుపోతుంది. మనలను దొంగ భక్తులుగా ప్రజలు భావిస్తారు. ఇంటికి వచ్చిన అతిధులు మనలను నిరాదరిస్తారు. కావున నేను గుర్తుపట్టకుండా ఉండేలాగున నా తలను తెంచి నీతో తీసికొనిపోయి ఈ పదార్థములతో అతిధులకు భోజనము పెట్టమని చెప్పెను. అంత కబీరు తన కుమారుని మాటలకు సంతసించి కుమారుని శిరస్సు ఖండించి ఇంటికి వచ్చి తన భార్యకు సరుకులను, కుమారుని తలను అప్పగించెను.

అందులకు కబీరు భార్య కొంత చింతించి కుమారా భక్తులకు, అతిధులకు భోజనం పెట్టామని నీవు నీ శిరాన్ని త్యాగం చేశావుకదా? ఎంత భాగ్యశాలివి అని కన్నీరు తుడుచుకొని అతిధులకు వంట చేయుటకు పూనుకొన్నది. ఆమె చేసిన వంటను తిని అందరు తృప్తిగా కబీరు జంటను దీవించి ప్రయాణమైరి. వారిని గ్రామము చివరకు సాగనంపెను.

వర్తకుడు కమాల్ మొండెమును రాజుకు చూపించగా అందరికీ కనిపించునట్లు రాజమార్గములో శూలమునకు గుచ్చి వేలాడదీసెను. కబీరు, భక్తులు ఆ మొండెం వద్దకు వచ్చిరి. ఆ మొండెము భక్తులకు చేతులెత్తి నమస్కరించెను. అది చూచి భగవద్భక్తులు ఆశ్చర్యము పొందిరి. ఇది ఎంతో వింతగనున్నదనిరి. అందుకు కబీరు ఈ శరీరము మిమ్ములను సేవించుటకై తలలేకున్నను ప్రాణముతో యున్నాడనెను. ఇప్పుడు ఆయనకొరిక నెరవేరి పరమ పధం చేరుతాడు అని తెలిపెను.

సాధువులు, భక్తులు అసలు జరిగిన విషయం వివరించమని వత్తిడిచేసిరి. అందులకు కబీరు జరిగిన వృత్తాంతమంతా వివరించెను. సాదువులు భక్తులు కరుణించి ఆ మొండెమును శూలమునుండి దించి కమాల్ శిరస్సును అతికించి భగవంతుని ధ్యానించిరి. భగవంతుని కృపచే ఈ బాలుడు జీవించుగాక అని స్పర్శించిరి. అంత కమాల్ అపుడే నిద్రనుండి లేచినట్లు లేచి సాధువులకు నమస్కరించెను. తల్లిదండ్రులకు ప్రదక్షిణము చేసి నమస్కరించెను. ఆ పట్టణములోని ప్రజలందరు ఈ వృత్తాంతము తెలసికొని కబీరు, కమాల్‌ల భగవద్భక్తికి, అతిధి సత్కారాలకై వారికున్న త్యాగనిరతిని కొనియాడిరి.

కబీరు, కమాల్ వంటి భక్తుల చరిత్రద్వారా అతిధుల విశిష్టత మనకు తెలుస్తుంది. అతిధులకు సేవచేయడం ద్వారా భగవంతున్ని చేరుకుంటామని తెలుస్తుంది. అందుకే హైందవ ధర్మం ''అతిధిదేవోభవ'' అని కీర్తించింది. మన యింటికి వచ్చిన అతిధికి పంచభక్ష పరమాణ్ణము వడ్డించకపోయినా ఉన్నతంతలో భోజనం పెట్టడంవాకిట నిలిచిన భిక్షగాళ్లకు పట్టెడన్నం అందించడం మరువకూడదు. అదే ''అతిధిదేవోభవ'' అన్నసూక్తికి మనమిచ్చే గౌరవం. ●

# మనసుకు నిద్ర - శరీరానికి ఆరోగ్య ముక్తి

......... జి.వి. శేషారెడ్డి .........

మనసుకు నిద్ర ప్రజ్ఞను పెంచే నిద్ర, శరీరానికి ఆరోగ్యముద్ర. ప్రస్తుతం మనం జీవిస్తున్న కాలం పోటీలో అతలాకుతలంగా ఉందన్నది నిజం. ప్రతి నిముషము ఒత్తిడి, ఆందోళన, భయం, అభద్ర, అసంతృప్తి, అశాంతులతో ప్రతి మనిషి, సతమత మౌతున్నాడు. ఒత్తిడిలో హృద్రోగాలు, ఆందోళనతో ఆత్మహత్యలు, అసంతృప్తి, అశాంతులతో అన్యోనత లోపాలు గమనించడం పరిపాటి అయినది. గమనిస్తే గమ్యం గోచరిస్తుంది. పరిశోధిస్తే పరమాత్మకూడ కళ్ళకి కనపడతాడు. సాధనతో సాధ్యం కానిది ఏది లేదు శోధనతో తెలుసుకోలేనిది ఏదీలేదు. అపారమైన విజ్ఞానాన్ని సొంతం చేసుకొన్న మనిషి తను చిక్కుకొన్న వలయంలో విలవిల లాడుతున్నాడేకానీ బయటికి రాలేక పోతున్నాడు. కారణము సరియైన విచారణ, విశ్లేషణ లేకపోవడం మహానుభావులు, మహర్షులు ఎందరోవారి అనుభవాల నిధిని లోక కళ్యాణము కోసము వివరించారు. వారి అమూల్యమైన సలహాలను, సూచనలను మనము అనుసరిస్తే ప్రతి జీవితము స్వర్గమయమేకదా! పతంజలి మహర్షిగారు ప్రబోధించిన అష్టాంగయోగలో ప్రతి మనిషికి శారీరకమైన, మానసికమైన ఆరోగ్యానికి ఎన్నో మెళుకువలు వివరించారు కదా. ఆసనాలు ఆరోగ్యానికి శాసనాలు అన్నాడు. ప్రాణాయామము మానసిక ఆనందానికి ప్రత్యామ్నయం. యోగ నిద్ర మనసుకు మేలుకొలుపు శరీరానికి ఆరోగ్యముద్ర అని అన్నారు. 5 వేల సం॥ క్రితము పతంజలి మహర్షి అందించిన యోగశాస్త్రము సత్యనిత్యము ప్రతి మనిషికి సంజీవని. ఈ యోగ శాస్త్రంలోని ప్రతి అంశము నేటి ఈ నాటిపోటి యుగానికి సర్వమంటే అతిశయోక్తికాదు.

ఆధునిక జీవితాన్ని అతలాకుతలం చేస్తున్న అసంఖ్యాకమైన, అసంబద్ధమైన సవాళ్ళను అధిగమించడానికి పతంజలి మహర్షి తన యోగశాస్త్రంలో చెప్పిన అంశాలెన్నో ఎన్నెన్నో "ఆరోగ్యమే మహాభాగ్యం" అన్న ఆర్యోక్తిని పరిశీలిస్తే తెలుస్తుంది. మనిషికి ఆరోగ్యమే ప్రధమమని. అయిన మనిషి తన జీవితాన్ని సరిఅయిన మార్గంలో తెచ్చుకోలేకపోవడం, సరైన మార్గాన్ని ఎంచుకోలేకపోవడం అనేది సత్యం. మనిషి జీవితం యాంత్రికమైన తర్వాత ఎన్ని మార్పులుచోటుచేసుకొన్నాయో, శారీరక శ్రమలేదు. మానసిక ప్రశాంతత అసలులేదు. ఆనందం అసలులేదు. నవ్వులేదు. శరీరానికి కనీసమైన కసరత్తులేదు. శారీరక శ్రమ అసలులేదు ఎందుకంటే ప్రతిపని యంత్రము చేస్తుంది కనుక. ఆహార విషయానికి వస్తే నియమాలు లేకుండా, నియంత్రణ అసలేలేకుండా తీసుకోవడంవల్ల తీసుకొన్న ఆహారము ఖర్చుకావడానికి శారీరక శ్రమ అసలు లేకపోవడంవల్ల, శరీరము రుగ్మతలైన బి.పి., షుగర్, గుండె జబ్బులు, కీళ్ళనొప్పులు, ఊభకాయం లాంటివి చోటు చేసుకొంటున్నాయి. మానసికమైన ప్రశాంతత అసలు ఉండదు. ఎందుకంటే A sound body is the place at a sound mind. సహజమైన ఒత్తిడి,

ఆందోళన, అశాంతి, అభద్రత లేకుండ శారీరక రుగ్మతలు మనిషిని అన్నివిధాల ముగ్గంచేస్తాయి.

**బ్రహ్మ ముహూర్తం :** బ్రహ్మ ముహూర్తంలో యోగాను ముగించుకొని అంటే వ్యాయామము, ప్రాణాయమము, ఆసనాలు ముగించుకొని శవాసనంలోకి వెళ్ళి యోగనిద్రలోకి వెళ్ళాలి. యోగనిద్రలో ఎరుక (మెళుకు) లోనే ఉంటాం. కాని పొందే శాంతి, ప్రశాంతి, విశ్రాంతి అనిర్వచనీయం. శాస్త్రీయంగా గమనిస్తే మెదడులోని పొరలలో ఒక పొర పూర్తిగా నిద్రావస్థలో ఉంటుంది. ఇందొక పొర చైతన్య స్థితిలో ఉంటుంది. ఎందరో మునులు, మహర్షులు వెలిబుచ్చిన అభిప్రాయం ఇదే. సత్యం ఇది. అభ్యాసముతో యోగ నిద్రలోకి వెళ్ళవచ్చునన్నది సత్యం. నిద్రలో ఉంటూకూడ ఎరుక కలిగి ఉంటే గమనస్థితిని తురీయ స్థితి లేదా తురీయ అవస్థ అంటారు. ఈ విషయము సాధన ద్వారా తెలుస్తుంది.

మనిషికి కోరికలు సంకెళ్ళు. ఈ సంకెళ్ళలో మనిషి బంధీగా ఉన్నాడు. అందుకే అరిస్టాటిల్ Man is born tree but he is always every where in chains. అని అంటారు. ఈ కార్పొరేట్ పోటియుగంలో ప్రతి మనిషి వృత్తిలోను, ఉద్యోగ విషయంలోను, పదోన్నతి విషయంలోను, కుటుంబ పోషణ విషయంలోను ఇలాంటి జీవన పోరాట విషయాలలో అసంతృప్తి, భయం, అభద్రతా భావం చోటుచేసుకొని మనిషిని అతలాకుతలం చేస్తున్నాయి అని అంటంలో అతిశయోక్తిలేదు. మనిషి జీవితంలో నిద్ర, నిబ్బరం ఉండవు. నిరాశ తప్ప. దీనికి కారణము తనను తాను మలచుకోలేకపోవడం. 'నీ విధికి నీవే శిల్పివి. మన ఆరోగ్యం మనచేతుల్లో అని గమనించలేకపోవటమే. ఈ రోజు గమనిస్తున్న బి.పి. షుగర్, గుండె జబ్బులు, లివర్ వ్యాధులు, కిడ్ని వ్యాధులు, కీళ్ళ వ్యాదులు, ఊబకాయం, చర్మవ్యాదులు ఒక్కటేమిటి సమస్త శారీరక అనారోగ్యానికి కారణం మానసిక ఆరోగ్యం సరిగాలేక పోవడము 70% కారణమైతే మన ఆహరపు అలవాట్లు 30% కారణమంటే అతిశయోక్తికాదు. మనిషిలో నిరాశ, నిస్పృహలు చోటు చేసుకొంటే ఏ మందు కాపాడలేదు. ప్రతి మనిషి తన మనసును ఎరుకలోకి తెచ్చుకొంటే సమస్యకు పరిష్కారము దొరుకుతుంది. డిప్రషన్‌లో ఉన్నపుడు మనిషి క్షణికావేశాలకు గురై ఆత్మహత్యలకు పాల్పడుతున్నాడు. భారతదేశంలోని ఆత్మహత్యలలో ఎక్కువ భాగం ఈ కోవకి చెందినవే ఇటువంటి సమయంలో ఆత్మస్థైర్యం, మనోనిబ్బరం కోసం యోగులు, మహర్షులు మనకు ప్రసాదించిన వరం యోగం. యోగనిద్ర శ్రీ మహావిష్ణువు శేషతలం మీద యోగనిద్రలో ఉన్నట్లు యావత్ సృష్టిని తనలో ఇముడ్చుకొన్నట్లు పురాణాలలో తెలియచేయుట జరిగింది. భారతీయ వేదం యోగ నిద్రకు దైవత్వాన్ని ఇచ్చింది యోగనిద్ర దేవి నివాసం శ్రీమహా విష్ణువు కనురెప్పలట. ఆదిశంకరుడు తన తారావళిలో యోగనిధ్రప్రాశశ్యాన్ని వివరించినట్లు ఉవాచ, యోగనిద్ర సమయంలో మాయ మాయమౌతుంది. అహం అంతరించిపోతుంది. ఇంద్రియాలకు మనసుకు మద్య సంబందం తెగిపోతుంది. యోగులు అనుభవించే దివ్య చైతన్యమే యోగనిద్ర.

**నిత్యజీవితంలో యోగనిద్ర ఎలా :**

యోగనిద్రను సంపూర్ణంగా ఆస్వాదించాలంటే, ఫలితాన్ని అనుభవించాలంటే పతంజలి మహర్షి మరెందరో మహర్షులు సూచించిన క్రమబద్ధమైన యోగ సహితమైన జీవనశైలిని అనుసరించాలి.

యోగాసనాలు, ప్రాణాయామాం క్రమంతప్పకుండా అభ్యాసము చేసి ఆహారపు అలవాట్లను మార్చుకోవాలి. యోగం అంటే స్థూల శరీరము, సూక్ష్మ శరీరము కలయుక. శరీరము, మనస్సు ఒకదానిలో ఒకటి ముడిపడి ఉంటాయి. ప్రాణాయామం, ఆసనాలు తర్వాత యోగనిద్రను ఉపక్రమిస్తే ఎరుకలో ఉంటూ చేతన స్థితికి చేరుకొని మానసిక శాంతిని పొందగలనున్నది నిర్వివాదంశము. నేడు యోగనిద్ర అంతర్ జాతీయంగా పేరుపొందినది. కారణం అనిశ్చత, అభద్రత, అశాంతి పరిస్థితులను అధిగమంచి మనోనిబ్బరాన్ని , మనోధైర్యాన్ని ప్రసాదించేది యోగనిద్ర కాబట్టి యోగనిద్రలో మెదడు బాహ్య పరిస్థితుల మీద దాదాపుగా నియంత్రణను కోల్పోతుంది. ఈ స్థితిలో చూడలేం, వినలేం, మాట్లాడలేం, స్పందించలేం అయినా ఎరుకలోనే ఉంటాం. మెదడులోని ఒకపొర విశ్రాంతిని పొందుతుంది. మరొక పొర చైతన్యస్థితిలో ఉంటుంది. ఉపనిషత్తులలో యోగనిద్రను చేతన నిద్రా అన్నారు. ఎందుకంటే యోగనిద్ర అటు నిద్రకాదు, ఇటు మెళుకువా కాదు. సన్యాసులు, మహార్షులు పూర్వాశ్రమ వాసనల్ని తొలగించుకోడానికి ఈ ప్రక్రియను ఉపయోగించుకొనేవారట. పావుగంట యోగనిద్ర నాలుగు గంటల నిద్రకు సమానము.

**యోగనిద్రకు అనువైన సమయం :**

యోగనిద్రకు ఉదయంకాని, సాయంకాలముకాని మంచి అనువైన సమయం. బ్రహ్మముహూర్తంలో ప్రాణాయామములు చేసిన తర్వాత యోగనిద్రలోకి వెళ్ళితే పొందే అనుభూతి అద్భుతము. అలసినపుడే వచ్చేది నిద్ర అయిన ధ్యాసను మనసుపై ఏకాగ్రత కుదిర్చితే ఎరుకతో చైతన్య స్థితిలో ఉండగలం. అపుడు మన పరిస్థితి "అంతర్ ముఖి సదాసుఖి" అన్ననానుడిని అన్వయించుకోవచ్చు.

**విచారణ - విశ్లేషణ :**

అంతర్ మధనం, అంతర్ ప్రయాణం జరిగి ఆలోచనలను విచారించుకొని, విశ్లేషించుకొని ప్రశాంతతకు నిజమైన దారిని వెతుక్కుంటాం. ప్రాణాయామములద్వారా ఈ స్థితిని పొందగలం ప్రాణాయామం ముగిసిన తర్వాత యోగనిద్రలో గమ్యాన్ని చేరగలం. ఆలోచనలు కనుమరుగై పోతాయి. ఏకాగ్రత కుదురుతుంది. అర్జునునికి తల మాత్రమే కనిపించినట్లు యోగనిద్రలో ప్రశాంతత ఒక్కటే చోటు చేసుకొంటుంది.

**విశ్వాసంతో అంతర్ విశ్వాసాన్ని జయించవచ్చు :**

విశ్వాసంతో అంతర్ విశ్వాసాన్ని జయించవచ్చు. లోపలవున్న శక్తి వెలికి రావాలంటే విశ్వాసముతో సంకల్పించాలి. ఆ పని యోగనిద్రతో సాధ్యముకదా! విశ్వాసములేక ఏ పనిని సాధించలేం. సంకల్పానికి విశ్వాసము విత్తనం కదా! సకారాత్మక భావనలు మనసులో మెదలాడుతుంటే విజయము మన గుప్పెట్లోనే కదా! అనవసరాన్ని త్యజిస్తావు అవసరాన్ని చరిస్తావు. సకారాత్మక ఆలోచనలకు యోగనిద్ర దైవత్వాన్ని పులుముతుంది. సంకల్పించిన దైవకార్యం,సత్‌కార్యము సాధించగలనన్న నమ్మకము పెరుగుతుంది. "ప్లాసిబో ఎఫెక్ట్" అన్న వైద్య పరిబాష విశ్వాసముతోనే ముడిపడివున్నది. సర్జికల్ హిలింగ్, ఆటో సజేషన్ థెరపీలో సకారాత్మక ప్రక్రియలు. అమెరికాకు చెందిన డా॥ గారీపీల్లే ప్రతిపనిలోను పూర్తి అంకిత భావంతో పని చేసే వ్యక్తి ఎంతటి సామాన్యుడైనా అతను అసమాన్య విజయాలు సాధిస్తాడని పేర్కొన్నారు.

**శ్వాసమీద ధ్యాస ఉంచు - యోగ నిద్రలో స్వర్గాన్ని తిలకించు :**

ధ్యానమంటే శ్వాస మీద ధ్యాస శ్వాసను గమనిస్తే జీవుడ్ని గమనిస్తున్నావన్నమాట. జీవుడే దేవుడు. శ్వాసను గమనిస్తే నిన్ను నీవు తెలుసుకొంటావు.అంతర్ ముఖిగా మారతావు. శ్వాసమీద ధ్యాస ఉంచడానికి అభ్యాసము ఒక్కటే సాధనము. ఆలోచనలు అంతులేకుండా వస్తూ ఉంటాయి. ఆలోచనలను అదుపు చేయలేం. అందుకని ఆలోచనల్లో ఎదగాలి. వచ్చిన ఆలోచనలను సంకల్పాలుగా మార్చుకోవాలి. సంకల్పాన్ని సకారాత్మకంగా మలచుకొంటే ఆనందాన్ని, అమృతాన్ని పొందగలం. మనసు పంపే సంకేతాల్ని బట్టి స్పందిస్తుంది మెదడు. సాధన ప్రక్రియతో తామరాకుపై నీటి బొట్టులాగ ఉండగలం. మనసుకు ఊహించే శక్తి ఉంది మంచిని ఊహించగలదు. చెడును ఊహించగలదు. ఎరుకతో అందమైన ప్రపంచాన్ని ప్రకృతిని ఊహించుకొని ప్రకృతికి కారణ భూతమైన దైవాన్ని చూచే నిశ్చలస్తితిని పొందవచ్చు. అసలైన ఈ నిశ్చలస్థితి ఉన్నతస్థితి. ఈ స్థితిలో సృజనాత్మక శూన్య స్థితిని పొందగలం. ఈస్థితి అంటే రంగానికి అనూహ్యమైనది. చైతన్య స్థితిలోనే అనుభవాలను పంచుకొంటావు అలజడి, ఆందోళన, అశాంతులను దూరము చేసుకొంటాం. ఆలోచనలు పవిత్రంగా ఉండాలి. అందుకే ఆలోచనల్లో ఎదగాలి. మన జీవన శైలిని కూడ మార్చుకోవాలి. ఎవరైతే బలహీనుల సేవలోను, పేదలకు చేసే సేవలోను వికలాంగుల సేవలోను సృష్టికర్తను చూడకలిగిననాడు అతను ఉన్నత స్థితిలో ఉన్నట్లే కదా. కాని శివుని విగ్రహములో మాత్రమే శివుడ్ని చూడమనేది ప్రాధమిక స్థాయి అంటారు స్వామివివేకానందులవారు. మనస్సును మంచి ఆలోచనలతో సేవలో తరిస్తున్నట్లు భావించి ఆలోచనలకు రూపాన్ని ఇవ్వగలిగే స్థితిని పొందగలిగనపుడు మనం అనుభవించే అనుభవము, ఆ ప్రశాంతత వర్ణనాలోపము. అందుకే నిద్రనుయోగ నిద్రగా మార్చుకొందాం. పరిపూర్ణ మానసిక శారీరక ఆరోగ్యానికి నాందిపలుకుదాం. బుద్ధుడు బోధించింది "ఆత్మ దీపోభవ" "నీ మనసే నీకు వెలుగు నీ మనసే నీకు గురువు". అంతర్లీనమైన శక్తిని వెలికి తీసి తనలో దాగివున్న శక్తిని తెలియచేస్తుంది యోగనిద్ర. అతలాకుతలంగా వున్న నేటి మానవుని జీవితం యోగంతో యోగనిద్రలో లయబద్ధంగా శాంతియుతంగా గమ్యాన్ని చేరుకోవచ్చు అనటంలో అతిశయోక్తిలేదు.

## వరలక్ష్మి వ్రతం

మన అచలానంద ఆశ్రమములో
శ్రావణ శుక్రవారం అనగా
తేది 28-8-2015 **వరలక్ష్మి వ్రత**
సందర్భముగా ముత్తైదువులు,
బాలికలతో కుంకుమ పూజ
నిర్వహించబడును. కావున
భక్తులందరూ విచ్చేసి అమ్మవారి
కృపకు పాత్రులు కాగలరు.

**గమనిక :** పూజలో పాల్గొనదలచినవారు
ముందుగ ఆశ్రమములో
తెలియజేయగలరు.

# సనాతన ధర్మము - దాని విశిష్టత

...... స్వామి ముకుందానంద సరస్వతి, ఋషికేష్: 09410990829

(గత సంచిక తరువాయి)

## 19. పాలక (రాజ) ధర్మములు

పూర్వకాలములో రాజ్యములు, రాజులుండుట మూలమున మనుమహర్షి 'రాజధర్మములు'గా పేర్కొన్నాడు. కాని, ఈనాడు రాజులు, రాజ్యములంతరించినవి. ప్రపంచమంతట ప్రజాస్వామ్యములు నెలకొన్నవి. అందువలన, ఇపుడు ప్రజలచేత ఎన్నుకొనబడిన ప్రతినిధులచేత దేశములన్నియు పాలింపబడుచున్నవి. వారినే పాలకులందురు. కాబట్టి పూర్వపు 'రాజధర్మముల'ను ఈనాడు 'పాలకధర్మము'లనుట ఉచితము. ఆనాటి రాజుల పాలన కానీయుండి, లేక ఈనాటి ప్రజాప్రతినిధుల పాలన కానీయుండి, పాలనావిధానములో ఎక్కువ మార్పేమియు ఉండదు. ఆ రాజధర్మములలో ముఖ్యమైనవి ఈనాటి పాలకులకు గూడా వర్తించును. కావున, మనుమహర్షి చెప్పిన కొన్ని ప్రధానమైన ధర్మముల నిచట విచారించెదము.

**శ్లో॥ తస్యార్థే సర్వభూతానాం గోప్తారం ధర్మమాత్మజమ్।**
**బ్రహ్మతేజోమయం దండమసృజత్పూర్వమీశ్వరః॥ (మను VII-14)**

'రాజ్యపాలనా విధానము విజయవంతముగా జరుగుటకు, సృష్టికర్తయైన బ్రహ్మ మొదట ఒక తేజోవంతమైన దండము రూపములో ధర్మమును తన తనయునిగా సృష్టించినాడు'.

బ్రహ్మచేత సృష్టింపబడిన ధర్మమను ఈ దండమునే 'రాజదండ' మందురు. 'పరిపాలనాధికారము'నే దండముతో పోల్చిచెప్పిరి. ఈ దండము చేతిలో ఉన్నపుడే రాజునకు (పాలకునకు) ప్రజలను పాలించు శక్తి లభించును.

**శ్లో॥ తస్య సర్వాణి భూతాని స్థావరాణి చరాణి చ।**
**భయాద్భోగాయ కల్పంతే స్వధర్మాన్న చలంతి చ॥ (మను VII-15)**

'ఈ రాజదండము యొక్క భయముచేతనే చరాచర జీవులన్నియు తమ తమ నైతిక మార్గములను ఉల్లంఘించక ప్రవర్తించుచు, ఆనందము ననుభవింపగలవు.

**శ్లో॥ తం దేశ కాలౌ శక్తించ విద్యాం చావేక్ష్య తత్త్వతః।**
**యథార్హతః సంప్రణయేన్నరేష్వన్యాయవర్తిషు॥ (మను VII-16)**

'కావున, రాజు (పాలకుడు) నేరములకు తగినట్లుగా దేశ, కాల, శక్తి ననుసరించి శాస్త్రానుసారముగా దండన విధింపవలయును.

దండన విధించునపుడు నేరస్థుని యొక్క శక్తిని గూడ మనస్సులో నుంచుకొనవలయునని పై సూక్తి సూచించుచున్నది.

**శ్లో॥ స రాజా పురుషో దండః సనేతా శాసితా చ సః ।**
**చతుర్ణామాశ్రమాణాం చ ధర్మస్య ప్రతిభూఃస్మృతః॥ (మను VII-17)**

రాజదండమే రాజు, అదియే పురుషుడు, అదియే (సన్మార్గములో) నడిపించునదియు, అదియే శాసకుడు కూడ, అదియే నాల్గు ఆశ్రమముల యొక్క ధర్మములను సంరక్షించునది.

**శ్లో॥ దండఃశాస్తి ప్రజాః సర్వా దండ ఏవాభిరక్షతి।**
**దండః సుప్తేషు జాగర్తి దండం ధర్మం విదుర్బుధాః॥ (మను VII-18)**

'ఈ దండమే ప్రజలను పరిపాలించునది, ఇదియే

వారిని రక్షించునది. దేశములోని ప్రతివ్యక్తి నిద్రించు సమయమున (రాత్రి సమయమున) మేల్కొనియుండునదియు ఈ దండమే. ఈ దండమునే ధర్మము యొక్క ప్రతిరూపముగా పండితులు యెంచుచున్నారు.'

ప్రజలందరు నిద్రించునపుడు దుష్టజనులు చోరత్వము, హత్యలు మొదలగు దుష్టచర్యలకు ఒడిగట్టవచ్చును. కాని, వారు ఆ పనులు చేయలేకపోవుటకు కారణము - ఒక్క రాజదండము యొక్క భయము మాత్రమే. అంటే, ఆ సమయములో గూడ రాజదండము తన పనిని తానుచేస్తూనే ఉన్నదన్నమాట. అందుకే, అందరు నిద్రించు సమయములో గూడ రాజదండము మేల్కొని యుండునని చెప్పబడినది.

దుష్టులను భయపెట్టుటకు గాని, శిక్షించుటకుగాని, ఈ రాజదండము పటిష్ఠమయినదై యుండవలెను. ఏ దేశములోనైతే ఈ రాజదండము పటిష్టమై యుండునో, అచట నైతికవిలువలు ఉచ్ఛస్థితిలో నుండును. ఎచట రాజదండము బలహీనమైయుండునో, అచట నైతిక విలువలు పతనమై అరాచకము వృద్ధిబొందును. ఈనాడు మనము చూస్తున్న అరాచకమునకు కారణము ఇదియే.

**శ్లో॥ యది న ప్రణయే ద్రాజా దండం దణ్యేష్వతంద్రితః।**
**శూలే మత్స్యానివాపక్ష్యం దుర్బలాం బలవత్తరాః॥ (మనుVII-20)**

'రాజు దండనార్హులను తగు రీతి దండించని యెడల, చేపలను కొక్కెమునకు తగిలించి కాల్చి తినురీతిగా, బలహీనులను బలవంతులు తినివేయుదురు. (అనగా బాధించి, కష్టముల పాలు జేయుదురు).

**శ్లో॥ సర్వో దండ జితో లోకో దుర్లభో హి శుచిర్నరః**
**దండస్య హి భయాత్సర్వం జగద్భోగాయ కల్పతే ॥ (మనుVII-22)**

'ధర్మాచరణ పరాయణులు చాలా అరుదు. మిగిలిన సమాజమంతయు దండన (శిక్ష) చేత మాత్రమే క్రమబద్ధమైనర్పబడుచున్నది. సర్వజీవులు దండన యొక్క భయముచేతనే వారి వారి అర్హతల ప్రకారముగా వారనుభవించుచున్నారు. రాజదండము నుపయోగించు రాజునకు ఉండవలసిన లక్షణములను గురించి మనుమహర్షి ఇట్లు చర్చించుచున్నాడు.

**శ్లో॥ తస్యాహుః సంప్రణేతారం రాజానం సత్యవాదినమ్।**
**సమీక్ష్యకారిణం ప్రాజ్ఞం ధర్మకామార్థకోవిదమ్ ॥ (మనుVII-26)**

'రాజదండము నుపయోగించు రాజు సత్యవ్రతుడై యుండవలెను. రాబోవు పరిణామములను జాగ్రత్తగా ఆలోచించి, ప్రతి పనియు చేయువాడై యుండవలెను. ప్రాజ్ఞుడై యుండవలెను. ధర్మార్థ కామములను తెలిసినవాడై యుండవలెను.

**శ్లో॥ తం రాజా ప్రణయన్ సమ్యక్ త్రివర్గేణాభివర్ధతే।**
**కామాత్మా విషమః క్షుద్రో దండే నైవ నిహన్యతే॥ (మనుVII-27)**

'రాజదండమును న్యాయబద్ధముగా ఉపయోగించు రాజు తన యొక్కయు, తన ప్రజలయొక్కయు, ధర్మ, అర్థ, కామములను వృద్ధిజేయును. అట్లుగాక, కామాతురుడు, పక్షపాతి, నీచుడు అయిన రాజు అదేదండము చేత నశింపబడును.

**శ్లో॥ దండోహి సుమహత్తేజో దుర్ధరశ్చాకృతాత్మభిః।**
**ధర్మాద్విచలితం హంతి నృపమేవ స బాన్ధవమ్॥ (మనుVII-28)**

'మహాతేజోవంతమైన ఈ రాజదండమును నిగ్రహములేని వ్యక్తి పట్టుకొనజాలడు. రాజు (పాలకుడు) ఏ మాత్రము ధర్మచ్యుతుడయిన యెడల

(అనగ ధర్మము నుండి తప్పిన యెడల) ఆ రాజదండమే అతనిని సమూలముగ నాశనము చేయును.

పై సూక్తి ప్రత్యేకముగా ఈనాటి పాలకులు గమనించదగినది. ధర్మము నుల్లంఘించి, తమ ఇచ్ఛానుసారముగ పాలన గావించిన రాజకీయవేత్తలు సమూలముగా నశించుటయు, తమ దేశ ప్రజలచేతనే చంపబడుటయు మనము కనులారా చూచుచున్నాము గదా! పై సూక్తి ఈనాటి పాలకులకు కనువిప్పును కలిగించుగాక!

జితేంద్రియుడైన పాలకుడు మాత్రమే ప్రజలను పాలింపగలడనియు, వారిని అదుపులో పెట్టగలడనియు, అందువలన రాత్రింబవళ్ళు యోగాభ్యాసము నాచరించవలయుననియు మనుమహర్షి చెప్పుచున్నాడు.

**శ్లో॥ ఇంద్రియాణాం జయే యోగం సమాతిష్ఠేద్దివానిశమ్।**

**జితేంద్రియో హి శక్నోతి వశే స్థాపయితుం ప్రజాః॥ (మను VII-44)**

ఇంద్రియములను జయించుట కొఱకు రాత్రింబవళ్లు యోగము నభ్యసించ వలయును. ఎందువలననగా, జితేంద్రియుడైన పాలకుడే ప్రజలనదుపులో నుంచగలడు.

ప్రజలను పరిపాలించువాడు కామక్రోధ లోభములనెడి మూడు దుర్గుణములను త్యజించవలయుననియు, లేనయెడల అవి చాల విపత్కరమైన దుష్ఫలితములకు దారి తీయుననియు మనుమహర్షి వివరించుచున్నాడు.

**శ్లో॥ దశ కామసముత్థాని తథాష్టౌ క్రోధజాని చ।**

**వ్యసనాని దురంతాని ప్రయత్నేన వివర్జయేత్॥ (మను VII-45)**

'పరిపాలకుడు కామము వలన జనించు పది దుర్గుణములను, క్రోధమువలన జనించు ఎనిమిది దుర్గుణములను ప్రయత్నపూర్వకముగా త్యజించవలయును. ఈ పదునెనిమిది విపత్కరమైన దుష్ఫలితముల నిచ్చును'.

**శ్లో॥ ద్వయోరప్యేతయోర్మూలం యం సర్వే కవయో విదుః।**

**తం యత్నేన జయేల్లోభం తజ్జావేతావుభౌ గణౌ॥ (మను VII-49)**

ఈ రెండింటికి (కామ, క్రోధములకు) మూలము లోభమని పండితులంగీకరించుచున్నారు. ఈ రెండును లోభము నుండియే ఉత్పన్నమగుచున్నవి. కావున ప్రజాపాలకుడు ఈ లోభమును ప్రయత్నపూర్వకముగా జయించవలయును.

- **విచక్షణలేని ఆచరణ వాసనలేని పూవు లాంటిది. అది చూచే వారికి బాగానే వున్నా తనకు మాత్రం ఆత్మతృప్తిని కలిగించదు. పైగా అది ఎన్నటికీ పూర్ణఫలితాన్ని ఇవ్వజాలదు.**
- **ఎక్కడో అడవిలో పుట్టిన ఔషధం మొక్క మన రోగాన్ని నయం చేస్తోంది. ఇక్కడే ఒంటి (దేహం) మీద పుట్టిన గడ్డ రోగానికి కారణ మవుతోంది. ఆత్మీయులను గుర్తించేటప్పుడు దూరాన్ని బట్టికాక వారు చేసే పనిని బట్టి మాత్రమే నిర్ణయించాలి.**
- **చెడు సంకల్పాలు కలుపు మొక్కల వంటివి. వాటిని ప్రత్యేకించి మనం పెంచవలసిన పనిలేదు. కాని మంచి సంకల్పాలు పూల మొక్కల లాంటివి. వాటిని నిత్యం ఎంతో శ్రద్ధతో పెంచుకుంటూ రావాలి.**

# వేద పరిచయము

## యజుర్వేద పరిచయము

.......... ఆచార్య డా॥ మట్టి కృష్ణారెడ్డి ............

(ఏప్రిల్ సంచిక తరువాయి)

**అధ్యాయాల పరిశీలన** :

**12వ అధ్యాయం** : అగ్నిస్తుతి వ్యవసాయం యొక్క గొప్పతనాన్ని, ఓషధుల యొక్క ప్రయోజనాన్ని విశేషంగా తెలియజేసింది. అగ్ని ఆకాశంలో పొగను వ్యాపింపజేసి వర్షాన్ని కురిపిస్తుంది. భస్మరూపంలో ఉన్న అగ్ని జలం ద్వారా యవధాన్యాదిరూపంలో మారి ఆహారం అవుతుంది అంతేకాదు అరణిరూపంలో కూడా ప్రపంచీకరింపబడుతుంది. ఇంకా అనేక రూపాల్లో అగ్ని జీవరాశికి రక్షణనిస్తున్నది. వ్యవసాయం చేయడం వల్ల పంట లభిస్తుంది. తద్వారా ప్రజలందరూ సంపన్నులై గోజాతిని పోషించుకుంటూ క్షీరాన్ని ఆహారాన్ని పొందుతున్నారు. దీనివల్ల సుఖజీవనం లభిస్తున్నది. ఓషధుల వల్ల ప్రజలు ఔషధాలను తయారుచేసుకొని వ్యాధులను నివారించుకొంటున్నారు. క్షయ వంటిభయంకరమైన వ్యాధులను పోగొట్టే ఓషధులు ఈ భూమిమీద ఉన్నాయని, అవి దయగల దేవతాస్వరూపాలని ఈ అధ్యాయం తెలియజేసింది.

**13వ అధ్యాయం** : భగవత్ సృష్టిలోని మానవాళికి ఉపయోగపడేందుకై ఋతువులు, ఓషధులు, అహోరాత్రము, చెట్లు, వాతావరణం, సూర్యుడు, గోవులు ఇవన్నీ భాగాలై జీవులను పరిరక్షిస్తున్నాయని, ఇవన్నీ భగవత్స్వరూపాలని స్తుతించింది.

**14, 15వ అధ్యాయాలు** : 'యజ్ఞవేది' యజ్ఞ నిర్వహణకు మూలమని, దానికి ఉపయోగించే ఇటుకలను గురించిన వివరాలను తెలియజేసాయి. ఈ అధ్యాయాలలో అగ్నిని ఆవాహన చేసే విధానం కూడా ప్రధానంగా తెలియజేయబడింది.

**16వ అధ్యాయం** : ఆరోగ్య ప్రదాతయైన రుద్రుని వైభవం సమగ్రంగా ఆవిష్కరింపబడింది. రోగాలను పోగొట్టే వైద్యుడని, ఆబాల గోపాలాన్ని రక్షించే కారుణ్యమూర్తి, దుష్టులను శిక్షించే కాలకంఠుడని తెలియబడింది. ఈ అధ్యాయానికి 'నమకం' అన్న పేరు అత్యంత ప్రసిద్ధంగా ఉంది. ఈ యజుర్వేదం దుష్టశిక్షణ-శిష్టరక్షణ చేయమంటుంది. శత్రువులను చీల్చి చెండాడి ప్రజలను రక్షించమంటుంది. కాబట్టి ఈ విషయాన్ని విశేషంగా చర్చించింది. లోకంలో ఈ అధ్యాయానికి రుద్రాధ్యాయమనే పేరు వచ్చింది. శివాలయాలలో దీనిని అభిషేకసమయంలో పారాయణం చేస్తుంటారు. కాని ఇందులో వర్ణించబడిన రుద్రుడు పురాణకల్పిత రుద్రుడు (శివుడు) కాదు. రుద్రుడంటే 'రుద-రోదనే' దుష్టులను దండించి దారిలో పెట్టే రాజు అని అర్థం.

**17వ అధ్యాయం** : ఈ అధ్యాయం జీవహితాన్ని కోరే అగ్నిదేవతను, విశ్వకర్మను విశేషంగా స్తోత్రం చేసింది. ఇంద్రుడు పరాక్రమశాలి, న్యాయమూర్తి, ప్రజాహితాన్ని కోరే రాజాధిరాజు అని తెలియజేసింది.

**18వ అధ్యాయం** : ప్రధానంగా యజ్ఞ ఫలాన్ని, తర్వాత దేవతలు ప్రసాదించే పవిత్రతను, అన్నదాన శక్తి, సంకల్పశక్తిని, అవయవపటుత్వం, ఇంద్రియశక్తి,

దీర్ఘాయువు, శత్రుజయం మొదలైనవాటిని రుద్రుని ద్వారా కోరడం జరిగింది. కర్ణపేయమైన శబ్దసంచయంగల ఈ అధ్యాయాన్ని 'చమకం' గా కీర్తిస్తారు.

**19వ అధ్యాయం** : పాలు తేజస్సును, బలాన్ని వీర్యాన్ని ఇస్తాయని, సోమరసం ఓజస్సును ఇస్తుందని, వీటిని పొందే మానవులు దుష్టశిక్షణను, శిష్టరక్షణను చేపట్టవచ్చునని ప్రబోధించబడింది.

**20వ అధ్యాయం** : హవిస్సులతో తృప్తిపొందిన దేవతలు వివిధ పాపాలను నశింపజేసి అభ్యుదయాన్ని ప్రసాదిస్తారు. కనుక హవిస్సుతో దేవతలు తృప్తి చెందాలని ఈ అధ్యాయంలో ప్రధానంగా ప్రార్థించడం జరిగింది.

**21వ అధ్యాయం** : దేవతలు యజమానికి సకల సౌకర్యాలు కలిగించాలని మిత్రావరుణులు క్షేత్రాలను సారవంతం చేయాలని, ఆరోగ్యాన్ని ఇవ్వాలని, దేవతలు మనుష్యహోత్ర యాగాలను కూడా ఇంద్రుని యాగంలా పరిపూర్ణం చేయాలని ప్రార్థించడం ప్రధానాంశం.

**22వ అధ్యాయం** : బ్రహ్మశక్తి, క్షాత్రశక్తి వృద్ధి పొందాలని తద్వారా రాష్ట్రహితం చేకూరుతుందన్న భావంతో ప్రార్థించడం జరిగింది. అంతేగాక గోవులు అధిక క్షీరాన్ని, ఎద్దులు అధికభారాన్ని వహించగల శక్తిని పొందాలని, గుఱ్ఱాలు వాయువేగంతో పరుగెత్తాలని, మేఘాలు సమృద్ధిగా వర్షించి ఓషధులను వృద్ధి చేయాలని యజమానుడు పరాత్పరుని అర్థించడం కూడా ప్రధానమైన అంశం.

**23, 24 వ అధ్యాయాలు** : వేదాంత చర్చ, పరమాత్మమహిమ, సృష్టిక్రమం ప్రధానమైన విషయాలుగా ప్రస్తావించబడ్డాయి.

**25వ అధ్యాయం** : పరమాత్మసేవగా అశ్వమేధయాగాన్ని ప్రతిపాదించడం ముఖ్యమైన విషయం.

**26వ అధ్యాయం** : వేదవాక్కు శక్తిని, పర్వత, నదీక్షేత్రాలలో బ్రహ్మజ్ఞాన నిష్ఠకై ఉద్యమించడాన్ని ప్రశంసచేస్తూ లోకహితాన్ని ప్రబోధించడం ప్రధానాంశం.

**27వ అధ్యాయం** : అగ్నిగుణాలు వర్ణించబడ్డాయి. విశ్వమంతా వ్యాపించిన అగ్ని నీటి నుంచి పుట్టిందని, మేఘాలనుండి, నదులనుండి విద్యుత్తును పుట్టిస్తున్నదని ప్రబోధించింది.

**28వ అధ్యాయం** : అగ్నిహోత్ర గుణగణాలను, విధులను తెలియజేసింది.

**29వ అధ్యాయం** : అగ్నిస్తుతి, అశ్వస్తుతి, యుద్ధవిషయాలను ప్రధానంగా వివరిస్తుంది.

**30వ అధ్యాయం** : ముఖ్యంగా యజ్ఞంలో అన్ని వృత్తుల వారిని ఆయా పనుల్లో నియమించడం, తద్వారవారు పవిత్రులవుతారని తెలియజేస్తున్నది. గోహింస చేసేవారిని మృత్యుదేవతకు సమర్పించాలని చెప్పబడింది.

**31వ అధ్యాయం** : విరాట్ పురుషునిగా పరమాత్మను దర్శింపజేసింది. ఈ ఆధాయాన్ని పురుషసూక్తంగా పరిగణిస్తున్నారు. పరమాత్మ సహస్రాధిక కరచరణాదులలో విరాజిల్లుతున్నాడు. ఈ విశ్వమంతా నిండి ఉన్నాడు. విరాట్పురుషుని మనస్సునుండి చంద్రుడు, కళ్ళనుండి సూర్యుడు, చెవులనుండి వాయువు, ముఖంనుండి అగ్ని, నాభినుండి అంతరిక్షం, శిరస్సునుండి స్వర్గం, కాళ్ళనుండి భూమి, చెవులనుండి దిక్కులు పుట్టాయని, అవి సమస్త

మానవులు పరమాత్మనుండి ఎలా ఉద్భవించారో కూడా తెలియజేస్తుంది. ఇదే పురుషసూక్తం.

**32వ అధ్యాయం :** ప్రధానంగా విరాట్ పురుషుడైన పరమాత్మ యజ్ఞస్వరూపుడు. ఆ సృష్టికర్తకు హవిస్సును సమర్పించాలని తెలియజేస్తున్నది.

**33వ అధ్యాయం :** యజ్ఞమహిమ, సూర్యుని మహిమలు వర్ణింపబడివున్నవి. ఇంద్ర, అశ్వినీ దేవతలను కూడా ప్రధానంగా తెలియజేస్తున్నది.

**34వ అధ్యాయం :** మంగళకరమైన శివసంకల్పాలను అనుగ్రహించుమన్న యజమాని ప్రార్థన ఉన్నది. మేమిస్తున్న హవిస్సును స్వీకరించి సద్బుద్ధితో సత్కార్యాలతో మేము ఉండేటట్లు కటాక్షించమనే దేవతా ప్రార్థన ఇది.

**35వ అధ్యాయం :** పితృమేధాది పాకయజ్ఞాల వర్ణన ఉంది. యజ్ఞనిర్వహణకు విఘ్నాలు రాకుండా రక్షించుమని, యజమాని దేవతలను ప్రార్థించడం ప్రధానమైన అంశం.

**36వ అధ్యాయం :** దేవతానుగ్రహం వల్ల, వారి ప్రార్థనల వల్ల వందేళ్ళు సుఖసంతోషాలతో జీవించగలమన్న ఆకాంక్ష ప్రధానాంశం

**37వ అధ్యాయం :** తమ యజ్ఞాలను సుసంపన్నం చేసి సత్ఫలితాన్ని అనుగ్రహించమనే ప్రార్థన ప్రధానాంశం.

**38వ అధ్యాయం :** యజ్ఞంలో హుతశేషం స్వీకరించి ఈశ్వరుని సేవలో సఫలీకృతుడై సాయుజ్యం పొందాలని యజమాని ఆకాంక్షిస్తాడు.

**39వ అధ్యాయం :** యజ్ఞం వల్ల దిక్కులు, ప్రకృతి, సర్వేంద్రియాలు ప్రసన్నములై అభ్యుదయాన్ని ఇస్తాయి. యజ్ఞానుష్ఠానం సామూహిక ఫలితాన్ని అనుగ్రహిస్తుందన్నది ప్రధానమైన అంశం.

**40వ అధ్యాయం :** సర్వం బ్రహ్మమయమని వివరిస్తుంది. ఈశ్వరుని సృష్టిలో నిష్కామకర్మ ముక్తికారణమైనది. ఆదిత్యరూపంలో ప్రత్యక్షంగా ఉండేవాడు పరబ్రహ్మ అని, 'ఓం' కారం అనే ప్రణవమంత్రం బ్రహ్మస్వరూపమని తెలియజేసింది.

విశ్వమానవ సౌభ్రాతృత్వాన్ని, యజ్ఞమయజీవితాన్ని స్వార్థరహిత జీవితాన్ని ప్రభోదించిన ఆధ్యాత్మిక భావబంధురమైన అధ్యాయం ఇది.

ఈ విధంగా 40 అధ్యాయముల సంక్షిప్త సంగ్రహ పరిచయం చేయబడింది. ఈ పరిచయం కేవలం సముద్రంలో ఒక నీటి బిందువుతో కూడా సమానం కాదు. పాఠకులకు వేదాల పట్ల ఈషణ్మాత్రం అవగాహన కలుగాలని, శ్రద్ధాసక్తులు పెరగాలని మాత్రమే ఈ నా ప్రయత్నం. అనంతమైన వేదాన్ని అల్పాక్షరాలతో వర్ణించుట సాధ్యపడదు.

ఈ యజుర్వేదంలో గృహస్థ ధర్మములకు సంబంధించిన ఎన్నో విషయాలు వర్ణించబడినాయి. ఇంతియేగాక వర్ణాశ్రమధర్మాలు వివరింపబడ్డాయి.

కేవలం యజ్ఞవిషయాలేగాక అనేక వృత్తుల వర్ణన ఇందులో ఉంది. వ్యవసాయం, గృహనిర్మాణం, రథాల-వాహనాల నిర్మాణం మొదలైన విషయాలతోపాటు వైద్యం, న్యాయం, రాజ్యపాలన, పశుపాలన మొదలైన సామాజిక ప్రయోజనాత్మక కర్మలు ఇందులో ఉన్నాయి.

మానవుడు సామాజిక సంఘజీవి. ముఖ్యంగా కుటుంబజీవితం గడిపేవాడు. అందుచే సామాజిక నియమాలను కౌటుంబిక నియమాలను కూడా ఈ వేదం ఉపదేశిస్తుంది. యజుర్వేదం కర్మకాండకు చెందినదే అయినా ఆధ్యాత్మిక విషయాలెన్నో

**తరువాయి 30 వ పేజిలో.......**

# పరమశివుని గెలిచిన పిసినారి



... కట్టా నరసింహులు

కడప జిల్లాలోని రాజంపేట సమీపంలో తంగటూరు అనే గ్రామం ఉంది. ఆ గ్రామంలో కైలాసేశ్వర ఆలయం ఉన్నది. శివుడు స్వయంగా లింగరూపంలో ఆ గ్రామంలోని పరమలోభి నుండి ఆవిర్భవించాడు. అక్కడ వెలసిందే ఆ కైలాసేశ్వరాలయం. ఆ కథ చాలా అద్భుతంగా ఉంటుంది.

తంగటూరులో మారాబత్తుడు అనే విశ్వబ్రాహ్మణుడుండేవాడు. ఆయన కట్టడానికి, తినడానికి బోలెడంత ఉన్నవాడు. కాని ఇంటికి వచ్చిన యాచకుడు లేదనిపించుకొన్నవాడే కాని పట్టెడన్నం పెట్టించుకొని 'సుఖీభవ' అంటూ వెళ్లిపోయినవాడు లేనే లేడు. ఉన్నవాడు కదా! అని ఏ మాత్రం సంభావన ముట్టినా పుచ్చుకొని వెళ్లదామని కవులో, పండితులో, బ్రాహ్మణులో వస్తే వారికి నాస్తి అన్నమాట తప్ప తృణమో పణమో ముట్టేది శూన్యం.

కుడి చేత్తో కాకిని అదిలిస్తే మెతుకులు జారిపడతాయని, ఆ నష్టాన్ని కూడా భరించని మారాబత్తుడు ఎడమ చేత్తో కర్ర పుచ్చుకొని విసుర్తాడు. ఆకలి అంటే అన్నం పెట్టడు. దప్పికంటే నీరు పొయ్యడు. పిల్లికి బిచ్చం పెట్టని మహానుభావుడాయన. ఈయన పిసినారితనం కాస్తా కైలాసం దాకా ప్రాకింది. శివుడికి ఆశ్చర్యం వేసింది. ఆదిభిక్షువైన శివుడు మారాబత్తుణ్ణి పరీక్షించాలనుకొన్నాడు. యాచించి ఏ కొంచెమైనా మారాబత్తుని నుంచి గ్రహించాలనుకున్నాడు. యాచకబ్రాహ్మడి రూపంలో తంగటూరులో ప్రత్యక్షమయ్యాడు.

పరమలోభిగా పేరు గడించిన మారాబత్తుడు తన దగ్గరకు యాచన కోసం మానవుడు వస్తేనేం, మానవుడి రూపంలో దేవుడు వస్తేనేం - పిడుగుకైనా బియ్యానికైనా ఒకటే మంత్రం - లేదు పొమ్మనటం. ప్రతిదినం బ్రాహ్మణ వేషంలో శివుడు మారాబత్తుణ్ణి దర్శించటం, మారాబత్తుడు వెళ్లిరమ్మనడం ఇలా ఎంతోకాలం జరిగింది. శివుడికి విసుగురాలేదు. సరికదా! ప్రతిదినం సరికొత్తగా యాచిస్తున్నవాడివలె మారాబత్తుని ఇంటి ముంగిట ప్రత్యక్షమవుతూనే ఉన్నాడు. మారాబత్తుడు చెప్పిన సమాధానమే మళ్లీమళ్లీ చెబుతూనే ఉన్నాడు. హమ్మయ్య ఎంతోకొంత దానం చెయ్యడా? పరమశివుడు గెలిచి వెళ్ళిపోడా? అని అనుకుంటున్నారేమో - అదేం లేదు. మారాబత్తుడు విసిగి ఊరువిడిచి వెళ్లిపోవాలనుకొన్నాడు. అనుకున్నదే తడవుగా కాశికి బయలుదేరాడు. నడిచి నడిచి కాశీ చేరుకున్నాడు మారాబత్తుడు.

మారాబత్తుడు కాశిలో ఒక విడిదిలో దిగాడు. కాశిలోని అన్ని ప్రాంతాలు తిరిగాడు. గంగా స్నానం చేస్తే పుణ్యం వస్తుంది కదా! అనుకున్నాడు. గంగ ఒడ్డుకు చేరుకొని స్నానానికి సిద్ధమయ్యాడు. అదిగో అక్కడికి యాచక బ్రాహ్మణ వేషంలో శివుడు నిలబడి గంగాస్నానం పుణ్యం దక్కాలంటే దానం చేయాల్సిందే అన్నాడు. మారాబత్తుడు స్నానమైనా మానుకుంటాడు గాని, దానం చేస్తాడా! అలాగే వెనుదిరిగాడు.

మరుసటి దినం గంగా తీరానికి వచ్చాడు. సరిగ్గా శివుడు మళ్లీ యాచకుని వేషంలో ప్రత్యక్షం.

ఇలా ఒకటిరెండు దినాలు కాదు, ఆరు నెలలు సాగింది. స్నానం చెయ్యకుండా ఇంటికి వెళ్లకూడదనుకొన్నాడు మారాబత్తుడు. యాచక బ్రాహ్మడికి దానమివ్వడానికి సిద్ధపడ్డాడు. అయితే ఒక్క షరతు. ఆ దానమిచ్చేది తంగటూరులోనే. గంగాజలం చేత ముట్టి గిద్దెడు ఆళ్లు (రెండు చిట్లు ఆరికెలు) దానమిస్తానన్నాడు. శివుడు వెళ్లిపోయాడు. మారాబత్తుడు గంగా పుణ్యతీర్థంలో స్నానం ముగించుకొని కాశి విడిచి తంగటూరు చేరుకున్నాడు.

ఆ ఉదయానికే ఆదిభిక్షువు ప్రత్యక్షమయ్యాడు. మారాబత్తుడు ఇంట్లోదిగి అనారోగ్యంగా ఉందని చెప్పి పంపాడు. భిక్షువు మరుసటిదినం వచ్చాడు. మారాబత్తుడు అదే అనారోగ్యాన్ని కొనసాగించాడు. ఇలా కొన్ని నెలలు గడిచాయి. ఒకరోజు ఉదయానికి మారాబత్తుడు మరణించాడని వార్త పుట్టించుకొన్నాడు. అయినా శివుడు తన పట్టుదల వదల్లేదు. ఉత్తరక్రియలు జరిగితే చూచి వెళ్తానన్నాడు. ఇది తెలిసి మారాబత్తుడు మరో యోచన చేశాడు. తన కొడుకుతో ఊరు వెలుపల చితి పేర్చమని, అక్కడికి తీసుకవెళ్లి తనని చితిమీద ఉంచి కొంచెం నిప్పు ముట్టించమన్నాడు. అలాగయితే ఈ బ్రాహ్మడి పీడ విరగడవుతుందనుకున్నాడు.

మారాబత్తుని కుమారుడు ఊరి బయట చితి పేర్పించాడు. మేళ తాళాలతో పాడె గట్టి తండ్రిని తీసుకువెళ్లి చితి మీద పెట్టించాడు. కపటరూపంలో ఉన్న శివుడు కూడా మారాబత్తుని వెన్నంటి నడిచాడు. అతని పట్టుదలకు ఆశ్చర్యపోయాడు. కాటికైనా కదలి వచ్చాడు గాని, కాస్తంత దానం చేయడానికి మనసొప్పలేదు కదా! అనుకున్నాడు. తన పరీక్షలో మారాబత్తుడే గెలిచాడనుకొన్నాడు. చితి దగ్గరకు వెళ్లి మారాబత్తుణ్ణి లేపాడు. నీ మనోనిశ్చయానికి మెచ్చుకున్నాను. నాకు దానం చేయవద్దు లే! లేచి ఇంటికి వెళ్లు" అన్నాడు. మారాబత్తుడు చితి మీది నుంచి లేచాడు.

"స్వామీ! ఇంత పట్టుదలతో నన్ను చాలా కాలంగా యాచించావు. నీ బాధ తొలగుతుందని కాశికి వెళ్లిపోయాను. అక్కడ ఎదురయ్యావు. అక్కడా చాలాకాలం నన్ను తిప్పలు పెట్టావు. కాశి నుంచి తంగటూరు మళ్లీ రాలేవని గిద్దెడు ఆళ్లు ధారపోశాను. గంగా స్నానం అయిందనిపించుకొన్నాను. తంగటూరుకు తిరిగివస్తే ఇక్కడకూ వచ్చావు. అయ్యా సామాన్య మానవుడివే అయితే ఇంతగా నా వెంట పడవు. భిక్ష అవసరం లేనివాడివే అయ్యుంటావు. నా వెంట పడ్డావు. నన్ను పరీక్షించడానికి వచ్చిన శివుడివి" అని ఆయన కాళ్ల మీద పడ్డాడు.

మారాబత్తునికి శివుడు దర్శనమిచ్చాడు. "ఏం కోరుకుంటావో కోరుకో" అన్నాడు. మారాబత్తుడు చలించిపోయాడు పిసినిగొట్టువాడికి దర్శనమైన బోళా శంకరులు మీరు. నేనడిగింది కాదనరు. మీ దర్శనం అయిన తరువాత నేను జీవించవలసిన అవసరం లేదు. ప్రాణం వదులుతాను. నా సమాధి మీద మీరు లింగరూపంలో అవతరించండి" అన్నాడు.

పరమశివుడు సరే అన్నాడు. పిసినిగొట్టు మారాబత్తుడు పరమ పదించాడు. ఆయన సమాధి మీద లింగం అవతరించింది. అక్కడ గుడి వెలసింది. అక్కడ వెలసిన స్వామి కైలాసేశ్వరుడుగా మొక్కులు తీర్చుకొంటున్నాడు. ●

శ్రీ విరాట్ పోతులూరి వీరబ్రహ్మేంద్ర స్వాములవారి రచనల్లో విశిష్ట రచన

# వీరకాళికాంబా శతకము

భావచ్ఛందోనుసరణ: కీ.శే. డా॥ వి.వి.యల్.నరసింహారావు (కందిమల్లయ్యపల్లి) బ్రహ్మంగారి మఠం ఆస్థాన కవి

**మద్యమాంస రుచులు మరిగి సంపద పెంచు**
**నాస ఆకసంబు నంటునతడు**
**కడకు దివిని రంభజడలోన చిక్కునో**
**కాళికాంబ! వీర కాళికాంబ! 435**

తృష్ణ అంటే వాంఛ అనీ దప్పిక అనీ రెండర్థాలు చతుర్విధపురుషార్థాలైన ధర్మార్థకామ మోక్షాలలో కామం తృష్ణ లక్షణమే. వ్యసనాల వల్ల డబ్బు అవసరం పెరుగుతుంది. త్రాగుబోతుకు తింటానికి మాంసం, త్రాగటానికి కల్లు కావాలి. వీటికోసం సంపద పెంచు కోవాలి. ధనాశతో చూపు ఆకాశాన్ని అంటుతుంది. ఆశ తీరకుండానే చివరకు స్వర్గయాత్ర చేస్తాడు. వేరే పాపాలు చెయ్యలేదు కనుక స్వర్గానికే వెళ్ళాడు. అక్కడ రంభను చూచాడు. మళ్లీ ఆశ మొదలైంది. ఆమె జడలో పువ్వునైనా చాలు అనుకుంటాడు. మఱి యీ ఆశకు అంతెక్కడ? తృష్ణ లక్షణమే అంత.

**క్రూరకర్ములపయి గురునకు దయరాదు**
**రంభ గవయ చేటు రాక యున్నె?**
**భక్తి నొసలెయైన భావన కన్నులౌ**
**కాళికాంబ! వీర కాళికాంబ! 436**

కోరికలు తీర్చుకొనేందుకు ఎంత క్రూరమైన పని చెయ్యడానికైనా దుష్టులు వెనుకాడరు. అటువంటి వారి పైన గురువుకు జాలి ఎందుకుంటుంది? దుష్టుడు రంభను చూడగానే ఆమె మీదకు ఎగబడ తాడు. పరాభవం పాలౌతాడు. 'నేను భక్తుణ్ణి' అని చెప్పు కున్నంత మాత్రాన చాలదు. నొసట త్రిపుండ్రమో, తిరుచూర్ణమో పెట్టినంత మాత్రాన చాలదు. మనుసు లో ఉండే భక్తిభావన కన్నుల ద్వారా బహిర్గతం కావాలి.

**అలతి ఆచరణ ఆస లీడేర్పదు**
**ఆచరణమె ఫలము నందజేయు**
**జ్ఞాని కాడెవండె స్వల్పాచరణమున**
**కాళికాంబ! వీర కాళికాంబ! 437**

అన్నింటికంటే ముఖ్యం కర్మాచరణం. పనిచేసి చూడాలి. మాటలు చెప్పి ప్రయోజనం లేదు. 'కొంచెం ఆచరించాములే' అంటే కోరికకు పూర్తిఫలం రాదు. పూర్ణంగా ఆచరిస్తేనే పూర్ణఫలం. కొంచెం చేసిన వాడె వడూ జ్ఞాని అనబడడు. అతడు తెలిసిన విజ్ఞాని క్రింద జమకాడు.

**అడ్డమెవరు లేరు; అధికుండు తానెయౌ**
**పడ్డబండ దఖలు పడ్డ వాంఛ**
**ముక్కు వంకరైన ముకురంబు చూడడో**
**కాళికాంబ! వీర కాళికాంబ! 438**

తనకు అడ్డంగా వచ్చేవారెవరూ లేరు కనుక తానే అందరి కంటె గొప్పవాణ్ణనుకుంటాడు. దానివల్ల ఒక్క సారి నెత్తిన బండ పడినట్లవుతుంది. మనసులో ప్రవేశించిన (దఖలు పడిన) కోరిక నెత్తిమీద బండలా పడుతుంది. దానితో తలకూ ముఖానికీ గాయం కావచ్చు. ముక్కు వంకర పోనూ పోవచ్చు. వెంటనే అద్దంలో చూచుకుంటాడు. ముక్కువంకర పోయి నట్లు కనిపిస్తుంది. 'విఱ్ఱవీగిన నా స్థితే ఇంతకు తెచ్చింది నన్ను' అని కొంచెమైనా విచారించకపోడు. అప్పుడూ విచారించకపోతే అది వాడి కర్మ.

# ఆది గురువు ఆచార్య శంకరులు

- శ్రీమతి జానమద్ది స్వర్ణలతా జోషి

(గత సంచిక తరువాయి)

**మనీషా పంచకంలో జాతి భేదాలున్నాయా ?**

ఆచార్యుల జీవితంలోని ఈ సన్నివేశం సద్గురువు యొక్క ఔధార్యాన్ని, ఔన్నత్యాన్ని తెలియజేస్తుంది. దీని ద్వారా నిమ్న జాతివారికి కూడా విద్యా సౌకర్యం కలిగించి అస్పృశ్యతా నివారణకు సహకరించారన్నది ఇప్పటి ప్రజా నాయకుల భావన. అలా చేయడం తప్పని ఎవరూ ఏ కాలంలోనూ చెప్పలేదు. అలా అని దురాచారాన్ని ప్రోత్సహించకూడదు. అనేక జాతులున్న ఈ భారతంలో జాతి వైషమ్యం సహజమే. జాతులన్నీ నిర్మూలమైతే అందరూ ఒకే మానవజాతికి చేరినప్పటికి మనోవికారాలు తగ్గి శాంతియుత జీవనాన్ని గడపగలరా ? అంటే అది సందేహమే. ఏక జాతియే వున్న ఎన్నో దేశాలు ఈ ప్రపంచంలో వున్నాయి. కానీ ఆ దేశాలలో కూడా ప్రజలందరూ విద్యావంతులై, నీతిమంతులై స్నేహభావంతో వున్నారా ? అంటే 'లేదు' అన్నదే జవాబు.

కాని' మనీషా పంచకం'లో జాగ్రత్, స్వప్న, సుషుప్తి స్థితులలోనూ, బ్రహ్మాండాది పిపీలికా పర్యంతమూ అన్ని జీవుల శరీరాలలోనూ ఆత్మ చైతన్యం నిస్తరంగ. చిదానంద సముద్రంలా వుందని చెప్పబడింది. ఈ ఆత్మ తత్వానికి విప్ర-శ్వాపచ అన్న తేడా లేదు. జ్ఞానం గలవాడే సద్గురువని ఈ సన్నివేశం ద్వారా తెలుస్తుంది. ఆచార్యుడు ఆ జ్ఞానానికి తలవంచి వినయ విధేయతలతో శివుని స్తుతించారు. అందుకు మహాదేవుడు సంతోషించి 'నీవు ఉన్నత స్థాయికి చెందినవాడవు. తపోనిష్ఠను పరీక్షించడం జరిగింది. నీవు బాదరాయణుని వలె నా అనుగ్రహం పొందావు. బాదరాయణుడు శ్రుతులను విభజించి బ్రహ్మ సూత్రాలను రచించి దుర్మతులను ఖండించాడు. ఎక్కడో దొరికిన రెండు, మూడు వేదవాక్యాలను ఆధారం చేసుకొని కొంతమంది అవివేకులు కుత్సిత భాష్యాలను వ్రాస్తున్నారు, నీవు వారందరినీ తలదన్ని సుందరమైన, నిర్దుష్టమైన భాష్యాన్ని రచించు. అది జనప్రియమవుతుంది. భాస్కర నీలకంఠ, అభినవ గుప్త, గురు, మండన - మొ॥ పండితులను జయించి అద్వైతమే పరతత్వమని ప్రపంచానికి చాటు. జనుల అజ్ఞానాన్ని తొలగించే శిష్యులను తీర్చిదిద్ది, అద్వైత స్థాపనలో కృతకృత్యుడవై చివరకు నన్ను చేరు' అని చెప్పి అంతర్ధానమయ్యాడు. విస్మతులైన శంకరులు నదికి వెళ్ళి, తమ ఆహ్నికాలను ముగించి ఈశ్వర, గురువందన చేసి భాష్యరచనకు సంకల్పించాడు.

ఇక్కడొక సందేహం ఏమంటే మండనమిశ్రుడు తప్ప భాస్కరాది కవులు శంకరుల తరువాత వచ్చిన వారని, శంకరులు రచించిన భాష్యాలకు వీరు తమదైన వివరణ ఇచ్చారనీ చెప్పబడుతుంది. చిద్విలాసంలో చెప్పబడినట్లుగా ద్వైతం సత్యం కాదు. అద్వైతమే సత్యం. అది శివాదేశం కూడా. అలా అని ఆచార్యుల భాష్యం కేవలం ద్వైత ఖండనం కాదు. అద్వైతంలో వున్న ప్రక్రియా బేధాలను కూడా ఖండించి అందరూ అంగీకరించే అసాధారణ వేదాంత ప్రక్రియను పైకెత్తి భాష్యరచన చేశారు.

**శంకరుల బదరీ ప్రయాణం :**

తరువాత శంకరులు బదరీ ప్రయాణం సాగించారు. తమ పన్నెండవ ఏటనే అక్కడున్న బ్రహ్మనిష్ఠులతో విచార వినిమయం జరిపి బ్రహ్మసూత్రాలకు భాష్యం

రచించారు. తరువాత భగవద్గీతకు కూడా భాష్యాన్ని రచించారు. సనత్సుజాతీయానికి, తాపనీయానికీ భాష్యం రచించిన తరువాత 'ఉపదేశ సాహస్రి' రచించారు. సనందుడికి ఆ గ్రంధాలను మూడుసార్లు వివరించారు. సనందుడు ఆచార్యుల ప్రియ శిష్యుడని మిగిలిన వారికి ఈర్ష్య కలిగింది. శిష్యులలోని నకార భావనలను సమూలంగా తొలగించడం సద్గురువు కర్తవ్యం కదా! అందుచేత నదికి ఆవలి గట్టున వున్న సనందుని తక్షణమే ఈవలి గట్టున వున్న తన చెంతకు రావలెనని ఆదేశించారు. సంసార సాగరాన్ని దాటించే గురుపాదభక్తి ఈ నదిని దాటించలేదా ? అన్న భావంతో ఆ శిష్యుడు నదిలోనే నడక ప్రారంభించాడు. ఆ గురుభక్తికి ప్రకృతి పులకించి అడుగడుగునా పద్మాలు ప్రసాదించింది. అది చూచి ఆశ్చర్యచకితులైన ఆచార్యులు అతనికి 'పద్మపాదుడు' అని పేరు పెట్టారు.

చిద్విలాసీయం ప్రకారం ఆచార్యులు గురుసన్నిధిలో వున్నప్పుడే సూత్రభాష్యాలు, దశోపనిషత్తుల భాష్యాలు, గీతాభాష్యము, విష్ణు సహస్రనామము, రుద్రభాష్యము, సౌందర్యలహరి వెు॥ స్తోత్రాలను రచించారు. తల్లి తనను స్మరించడంతో తన ఊరికి వెళ్ళారని, అక్కడ నుండి ప్రయాగకు వెళ్ళారని చెప్పబడింది.

బలదేవ ఉపాధ్యాయ అనే శోధకుడి రచన ప్రకారం ఆచార్యులు బదరిలో వున్నప్పుడు బదరీనాధుని పునః ప్రతిష్ఠ జరిగిందని వర్ణింపబడింది. చైనావారి ఆక్రమణలకు భయపడి ఆ దేవతా మూర్తిని నారదకుండలో దాచి వుంచారని, ఆచార్యులు దానిని వెలికి తీయడానికి ప్రయత్నించగా అక్కడున్న పూజారులు అది అలకానాదలకు సంబంధించిననదని చెప్పారని, అక్కడ మునిగే వారికి ప్రాణాపాయం తప్పదని చెప్పినప్పటికీ ఆచార్యులు అందులో మునిగి మూర్తి వెలికి తీశారని, మూడు సార్లు మునిగి పైకి తీసినప్పటికీ కుడి భాగం విరిగిన మూర్తియే దొరికిందని, అప్పుడు అశరీరవాణి 'ఈ కలియుగంలో ఈ మూర్తినే పూజించాలి' అని చెప్పడంతో ఆచార్యులు దానినే వైదికరీతిలో ప్రతిష్ఠించారని 'బదరికాశ్రమ మహాత్మ్యం'లో చెప్పబడింది. అక్కడ 'తతోహం యతిరూపేణ తీర్థాన్ నారద సంజ్ఞకాత్, ఉద్ధృత్య స్థాపయిష్యామి హరంలోక హితేచ్ఛయా' అన్న శ్లోకం కూడా వుందని ఉపాధ్యాయ వివరించారు.

బాదరాయణుడు, ఇంకా అనేక మంది ఋషులు తపస్సు చేసిన పుణ్యప్రదేశం బదరీక్షేత్రానికి ఆచార్యులు వచ్చారని, చలి, ఎండ-వాన, ముళ్ళు-రాళ్ళు లెక్కచెయ్యక ఎందరో తపస్వీజనులను, జ్ఞానులను కలిసారని అలా ఆయన ప్రయాణం ముందుకు సాగిందని మాధవీయంలో చెప్పబడింది. ఆయన రచనా వ్యాసంగాన్ని గూర్చి విభిన్న అభిప్రాయాలున్నప్పటికీ రచనా కాలం కంటే రచనా వైశిష్ట్యానికి ప్రాముఖ్యత నివ్వాలి. "అష్టవర్షే చతుర్వేది, ద్వాదశే సర్వ శాస్త్రవిత్। షోడశే కృతవాన్ భాష్యం ద్వాత్రింశే ముని రభ్యగాత్" అన్న శ్లోకం ఆధారంగా ఆయన రచనా కాలాన్ని, జీవనకాలాన్ని తెలుసుకోవచ్చు.

ఇకపోతే పద్మపాదుడికి సనందనుడన్నది ఆచార్యులు పెట్టిన పేరని, ఆయన చోళదేశపువాడని పూర్వాశ్రమపు పేరు తెలియదని మాధవీయము, చిద్విలాసీయము, వ్యాసాచలీయము అన్న మూడు శంకర విజయ గ్రంథాలలో చెప్పబడింది. కాని గోవిందనాథ అనే పండితుడు పద్మ పాదుడిది కేరళ దేశమని, చిద్విలాసంలో లాగే అతని పేరు విష్ణుశర్మఅని, తండ్రి సోమశర్మ వైశ్యవృత్తిని కొనసాగించేవాడని చెప్పారు. ఆ విష్ణుశర్మ నిరంతరం ఆచార్యుల సేవ చేయడంతో వారిద్దరి మధ్య అనుబంధం పెరిగిందని ఆ కారణంగా

మిగిలిన శిష్యులలో అసూయ కూడా పెరిగిందని, పద్మపాదుడనే పేరు కూడా ఆచార్యుల వారే ఇచ్చారని, అందుకు తగినట్లుగా కథ అల్లబడిందని చెప్పబడింది. కాని సోమనాథయ్య అనే పండితుడు ఉదయపురములోని ఉదయసాగరమనే చెరువులో బారెడు వెడల్పు దళములు గల తామరపూవును చూశానని, పదేళ్ళ పిల్లవాడు కూర్చున్నప్పటికీ ఆ పువ్వు మునగదని తమ రచనలో పేర్కొన్నారు. ఇది ఆలోచింపదగిన విషయమే కదా! గంగానదిలో అంతపెద్ద తామరపూలుండేవా ?

**పాశుపత మతఖండన :**

ఒకనాడు ఆచార్యులు శిష్యులకు పాఠం చెబుతున్నప్పుడు కొందరు పాశుపత మతంవారు ఆయన అభిప్రాయాలలోని దోషాలను ఎత్తిచూపారు. కాని ఆచార్యుల వారు వారి అభిప్రాయాలను వేదప్రమాణంగానే ఖండించారు. దానితో వారి గర్వం కొంతవరకు అణిగింది. మాధవ కవి తమ రచనలో 'ద్వైతం సత్యమైతే ఈశ్వర సమానమనే ముక్తి జీవుడికి ఎలా లభిస్తుంది ? ధ్యానం ద్వారా అయితే అది నాశనం కావాలి కదా! పశుపతియైన ఈశ్వరుడి గుణాలు పశువులైన జీవులలో ఎలావచ్చిచేరుతాయి? గుణాలు నిరవయవాలు కదా! తామరపూవు వాసన వాయువుతో చేరునట్లుగా ఆ గుణాలు జీవులలో చేరలేవు. ఎందుకంటే సుగంధం వాయువుతో చేరితే జీవుడికి సుగందవాయువనే అనిపిస్తుంది. జీవులలో పరమేశ్వరుడి గుణాలన్నీ కనిపిస్తాయా ? లేదా ఒకొక్కక్క జీవిలో కొన్ని గుణాలు వచ్చి చేరుతాయా ? కొన్ని గుణాలు మాత్రమే అయితే గుణాలు సావయవమని చెప్పవచ్చు. అన్ని గుణాలు అందరిలో వుంటాయని పరమేశ్వరుడు అజ్ఞుడవుతాడని వ్రాశాడు.

ఈ పాశుపత ఖండనకు ఆధారమైన భాష్యమేదీ కనిపించదు. ఎదుకంటే సూత్ర భాష్యంలో 'పత్యు రసామంచన్యాత్' అన్న దగ్గరి నుండి 'అన్తవత్త్వమసర్వజ్ఞతా వా' అన్నదాకా వున్న సూత్ర వివరణలో పరమేశ్వరుడు కేవలం కాల నిమిత్తుడని, ఆ కారణంగా ప్రధాన పురుషులను శాసిస్తాడని - పాశుపతీవాదాన్ని విమర్శించడం జరిగింది. పరమేశ్వరునికి కూడ రాగద్వేషాలు వుంటాయని, ప్రధాన పురుషులకు ఈశ్వరునికీ ఎలాంటి సంబంధమూ చూపనవసనరంలేదని, పరమేశ్వరునికి కూడా శరీరముందని, అతడు పరిచ్ఛిన్నుడని, అసర్వజ్ఞుడని ఒప్పుకోవలసి వస్తుందని - ఇలాంటి దోషాలు గుర్తించడం జరిగింది.

**కాశీనగర ప్రస్తావన :**

అదే సర్గలోనే మాధవుడు కాశీనగరాన్ని గురించి ప్రస్తావించాడు. ' ఆ బాలుడి అమానుష ప్రభావాన్ని చూచిన ' 'కాశినగర వాస్తు' సర్వతంత్ర ప్రకాశితుడైన ఇతని చేత భాస్కర, గుప్త, మిశ్ర, ముతారి, విద్యేంద్ర గురు మొ॥ వారు పరాభవం చెంది వుంటారని భావించారు. దానికి ఆధారం ఆ రచనలోని 'కాశీపురస్థా' అన్న విశేషణమే. సోమనాథయ్య ఆచార్యులు కాశీకి వచ్చారంటే, సి.ఎస్.కృష్ణస్వామి అయ్యర్‌గారు ఆచార్యుల వారు కాశీలో చాలా కాలము, బదరీలో కొంతకాలం మాత్రం వున్నారన్నారు. ఎన్. వెంకటరామన్‌గారు బదరీ మాటే ఎత్తలేదు. బలదేవ ఉపాధ్యాయులు ఆచార్యులు ఉత్తరకాశీలో వుండేవారని చెప్పారు.

ఆచార్యులు తమ దగ్గరకు వచ్చిన కొందరు నైయ్యాయికులను ఖండించారు. ఇలా పరవాదుల ఆక్షేపాలను ఖండించినప్పుడంతా ఆచార్యుల భాష్యవివరణ మెరుగుపెట్టిన బంగారంలా ప్రకాశించేదని ఆచార్యులు వారికి వ్యాసదర్శనం ఉత్తరకాశీలోనే జరిగిందని కూడా మాధవీయంలో వివరింపబడింది.

(సశేషం)

# యోగవాసిష్ఠ కథాలహరి

డా॥ ధారారామనాధశాస్త్రి, ఒంగోలు

## ప్రహ్లాదుని ఆత్మ ప్రస్థానం

శ్రీ వసిష్ఠులు తమ కథా ప్రవచనాన్ని కొనసాగిస్తున్నారు :

రామచంద్రా! జగత్ప్రసిద్ధ భక్తాగ్రగణ్యుడైన ప్రహ్లాదుని గూర్చి నీకు పరిచయం చేయనక్కరలేదు. బాల్యం నుండి భక్తిభావంతో పండిపోయి దుష్టశిక్షణకీ శిష్టరక్షణకీ ఉద్దేశింపబడిన నరసింహావతారానికి కారణభూతుడైనాడు. శిక్షార్హుడు తన తండ్రి హిరణ్యకశిపుడైనా సరే నిర్మమము, నిరహంకారము అయిన దృష్టితోనే వ్యవహరించి ధన్యుడైనాడు. అటుపైన శ్రీమన్నారాయణుని ఆజ్ఞను పురస్కరించుకొని బహుకాలం ధర్మోత్తరంగా దైతేయ సామ్రాజ్యానికి పరిపాలకుడై మంచి పేరు తెచ్చుకున్నాడు. అవునా! ఈ ప్రస్థానంలో అతని సాధన ఆధ్యాత్మిక వికాసము ఎలాంటి పరిణామాన్ని చెందిందీ పరాకాష్ఠస్థితిలో అతను ఎలాంటి ఉత్తమ కక్ష్యను అధిరోహించినదీ ప్రస్తుతం. ఆ విషయాన్ని అవధానంతో ఆలకించు.

విశాల సామ్రాజ్యాన్ని పరిపాలిన్నూ అందరి ఆమోదాన్ని చూరగొంటూ జీవిస్తున్న ప్రహ్లాద చక్రవర్తి బాల్యం నాటి భక్తీ అందలి రక్తీ మరువలేదు. హరినామ స్మరణము తప్ప అన్యమెరుగని స్థితిలో ఉన్నట్టుండి అతనికొక నిర్వేదం కలిగింది. ఎన్నో భోగాలు అనుభవిస్తున్నాను. నా ఏలుబడిలో ఉన్న సమస్త ప్రజలయొక్క ఆమోదాన్ని పొందేను. అయినా ఎక్కడో ఒక అపశృతి, హృదయం నిండా వేదన. ఏదో తెలియని అసంతృప్తి ఈ కారణంగా బాధను అనుభవిస్తున్నాను గాని కారణం తెలీదు. కారణమే తెలియని స్థితిలో పరిష్కారమార్గం ఎలా లభిస్తుంది ? అని వేదనా దోదూయమాన మనస్కుడై బాధపడుతున్న స్థితిలో ఒకనాడు తన పూజాగృహంలో ఉన్న మూర్తినుండి స్వామి ప్రత్యక్ష సన్నిధి కటాక్షించారు. తన్మయుడై భక్త్యావేశంతో ప్రహ్లాదుడు స్వామిని నుతులచే నతులచే ప్రసన్నుని చేసుకున్నాడు.

త్రిభువన భవనాభిరామ కోశం
సకల కళంక హరం పరం ప్రకాశం
అశరణ శరణం శరణ్యమీశం
హరిమజమచ్యుతమీశ్వరం ప్రపద్యే!
కువలయదళ నీల సంనికాశం
శరదమలాంబర కోటరోపమానం
భ్రమర తిమిర కజ్జలాంజనాభం
సరసిజ చక్రగదాధరం ప్రపద్యే!!

(ముల్లోకాలు అనే భవనానికి రక్షకుడు, సమస్త దోషాలను హరించేవాడు, పరమ ప్రకాశస్వరూపుడు, దిక్కులేని వారికి దిక్కైనవాడు, సర్వశక్తి సంపన్నుడు జన్మరహితుడు, అచ్యుతుడు, ఈశ్వరుడు అయిన విష్ణుదేవుని శరణు పొందుతున్నాను. నీలకమలకాంతి, శరదాకాశ దీప్తి, తుమ్మెదలవంటి, చీకటి వంటి, కాటుకవంటి, అంజనమువంటి, నీలవర్ణశోభ, శంఖ చక్రాద్యాయుధాల వైభవము గల స్వామిని శరణు పొందుతున్నాను)

స్వామి దయతో 'ప్రహ్లాదా! నీ భక్తికి మెచ్చానయ్యా! ఇప్పుడేమిటి ? బాల్యం నుండే నీవు నన్ను అనన్య

భక్తిచేత ఆకట్టుకొని ధన్యుడవైనావు. అయినా నీ దగ్గరకు వచ్చాను కనుక ఏదైనా వరం, అదీ జనన మరణ జరా సంసారాది దుఃఖాలకు అతీతమైనది, నీవు కోరాలనీ నేనివ్వాలనీ నాముచ్చట' అన్నారు.

ప్రహ్లాదుడు స్వామిని ఆపాదమస్తకం ఆప్యాయంగా అలతి నవ్వుతో వీక్షించి 'అలాగా స్వామీ' అయితే ఏ వరం అన్నిటికంటే గొప్పదో, ఏది నాకు మంచిదో మీరే ఆలోచించి కటాక్షించండి' అన్నాడు.

'గడుసువాడవయ్యా! సరే!ఇలా అంటున్నాను. నీకు తత్త్వ విచార ప్రాప్తిరస్తు' అంటూనే స్వామి అంతర్హితులైనారు.

అదిసుతా రామచంద్రా! ప్రహ్లాదునిలో ఆత్మ విచారం ఆరంభమైనది. క్రమంగా పరిణతి చెందినది. వృక్ష తృణ పర్వత సహితమైన ఈ జగత్తు నేనుకాదు - అల్పకాలంలో నశించి పోయేదీ జడమైనదీ అయిన ఈ దేహము అనే ఉపాధి నేను కాదు.

'నిర్మమో మననఃశాన్తో గత పంచేంద్రియభ్రమః
శుద్ధచేతన ఏవాహం కలాకలన వర్జితః

(మమత్వ రహితము, మనన శూన్యము, శాంతము, పంచేంద్రియ భ్రమను వర్జించినది, సంకల్ప రహితమైనది అయిన శుద్ధ చైతన్యమే నేను.)

ఆ శుద్ధ చైతన్య రూపమైన ఆత్మయే సమస్త సృష్టికీ కడకు బ్రహ్మ విష్ణు రుద్రేంద్రాదులకూ అదే కారణం. అదే నేను - అన్న పరమోదాత్త స్థితిపొందిన ప్రహ్లాద చక్రవర్తి, ఓ రామా! జాగ్రత్తగా వినవయ్యా! నిర్వికల్ప సమాధిలో ప్రవేశించాడు. వైరాగ్య పరాకాష్ఠస్థితిని పొందేడు.

ఒక్కసారి సమీక్షించుకుంటే ప్రహ్లాద ప్రస్థానం తొలిదశలో భక్తిగమ్యమై మలిదశలో జ్ఞానవేద్యమై ఆ తరువాత వైరాగ్య సంపన్నమైనది. అంటే భక్తిజ్ఞాన వైరాగ్యాలు అనే మూడు సోపానాలు అధిరోహించడం అయిపోయింది.

ఈ స్థితిలో ప్రహ్లాదుని మరొక మెట్టు ఎక్కించవలసిన అవసరం ఏర్పడింది. లేకపోతే రాజ్యమూ, ప్రజా, ప్రజాపరిపాలన మొదలైన కర్తవ్యం సర్వమూ నశించి జనజీవనం స్తంభించి పోతుంది. అది వాంఛనీయం కాదు. అందుచేత స్వామి వెంటనే మళ్లీ సన్నిధిచేసి ప్రహ్లాదునికి ఇలా బోధచేశాడు. 'ప్రహ్లాదా! నీ చరిత్ర నాకు అపారమైన ఆనందాన్ని కలిగించిందయ్యా. నీ ఆత్మ సాధన గమనించి నేను తృప్తి చెందాను. కాని ఇటుపైన ఇంకొక మెట్టుఎక్కాలి.

'ఇష్టా నిష్ట ఫలం త్యక్త్వా సమదర్శన యా ధియా
వీతరాగ భయక్రోధో రాజ్యం సమనుపాలయ'

ఇష్టానిష్ట ఫలాలను త్యజించి రాగద్వేష భయక్రోధ రహితుడవై సమదర్శన బుద్ధితో రాజ్యపాలన చేయాలి.

ఇలా స్వామి ఆదేశించగా బహుకాలం ధర్మోత్తరంగా, పరిపాలించి ప్రహ్లాద చక్రవర్తి ధన్యుడైనాడు. అందుచేత ఓ రామా! నీవున్నూ జ్ఞానమార్గంలో ఎంత ప్రస్థానం చేసినా కర్తవ్యాన్ని ఏమరక వ్యవహరించాలి. వైక్లబ్యం విడనాడి విధి నిర్వహణకు పూనుకోవాలి. అంటూ శ్రీవసిష్ఠులు శ్రీ ప్రహ్లాద కథ ముగించారు.

- **నిరంతరం ఆలోచించేవాడిని పిల్లకాలువ కూడా మహాప్రవాహం లాగా భయపెడుతుంది. నిరంతరం శ్రమించే వాడికి మేరుపర్వతం కూడా మట్టిదిబ్బలాగా తేలికవుతుంది.**
- **అహాన్నికాని, పిరికితనాన్ని కాని చెంతకు రానివ్వకు. కారణం ఒకటి నిన్ను మెలకువగా వుండనివ్వదు. రెండోది అసలు నిద్రపట్టనివ్వదు.**

గీతా సుధ

# భగవద్గీతకు భాసుర భాష్యం



డా॥ రాధశ్రీ, కర్నూలు, ఫోన్: 9494481210

(గత సంచిక తరువాయి)

ఒక్కొక్కసారి మనకు బాగా తెలిసినవాడితో చాలా చనువుగా వుంటాం. మన సహధ్యాయులతో (క్లాస్-మేట్స్‌తో) సహోద్యోగులతో (కొలీగ్స్‌తో) చాలా సరదాగా గడుపుతాం. ఎన్నో మాటలు అంటాం, అనిపించుకుంటాం. దీనిని వాళ్ళుగానీ, మనంగానీ మనసులో పెట్టుకోం. అంత దగ్గర మిత్రులతో కాలం ఎలా గడిచిపోతుందో తెలియదు. అంత చనువుగా ఉండే మిత్రులలో ఒకనికి అమాంతం ఓ కలెక్టరు ఉద్యోగమో, ఓ రిజర్వు బ్యాంకు గవర్నరు ఉద్యోగమో వచ్చిందనుకోండి - ఎలా ఉంటుందో ఊహించుకోండి. మొదలు చాలా సంతోషపడతాం. పదిమందికీ "అతను నాకు తెలుసు, ఒకప్పుడు ప్రక్క ప్రక్కన కూర్చున్నాం, కలిసి పని చేశాం. అతను అంత కష్టపడ్డాడు. కాబట్టీ పైకివచ్చాడు" అని చెబుతుంటాం. "మనం ఇద్దరం కలిసి పనిచేసినప్పుడు ఏదో అన్నాం, అనుకున్నాం. అవన్నీ మరచిపో, అవి మనసులో పెట్టుకోకు" అని అతనికి చెబుతాం. ఇక్కడ నిజంగా అర్జునుడు అలాంటి భావాన్నే వ్యక్తీకరిసున్నాడు.

**శ్లో॥ సఖేతి మత్వా ప్రసభం యదుక్తం హే కృష్ణ! హే యాదవ! హే సఖేతి।**
**అజానతా మహిమానం తవేదం మయా ప్రమాదాత్ ప్రణయేన వాపి॥**
**(11-41)**

**శ్లో॥ యచ్చాపహాసార్థమసత్కృతఽసి విహారశయ్యాసనభోజనేషు।**
**ఏకోఽథ వాప్యచ్యుత తత్సమక్షం తత్ క్షామయే త్వామహమప్రమేయమ్॥**
**(11-42)**

నిజం చెప్పాలంటే ఈనాటికే కాదు ఏనాటికి సమానంగా అన్వయంపొందే శ్లోక యుగళం ఇది. "ఓ కృష్ణా నిన్ను స్నేహితుడి వనుకొని, నీ మహిమను తెలియలేక ఎన్నోసార్లు సాధారణంగా సంబోధించాను. 'ఒరే కృష్ణా, ఒరే యాదవా' అని కూడా పిలిచాను. నన్ను దయతో క్షమించు. మనం ఇద్దరం కలిసి ఆడుకునేటప్పుడు, భోజనం చేసేటప్పుడు, వాహ్యాళికి వెళ్ళినప్పుడు, కూర్చున్నప్పుడు, పడుకున్నప్పుడు, నిన్ను చాలా సరదాగా సంబోధించేవాడిని. అవి అన్నింటినీ పెద్ద మనసుతో క్షమించి మరచిపో. నీ గొప్పతనం తెలుసుకోలేకపోయాను" అన్నాడు. మన ఇంట్లో ఉండి, మనం పెడితే తిని, మనం తిడితే పడి, చదువుకున్న బంధువులబ్బాయి ఒకసారిగా ఊహించలేనంత గొప్పవాడయిపోతే ఎలా ఉంటుంది. ఎలా ఉంటుంది కె. విశ్వనాథ్ గారి "సిరివెన్నెల" సినిమా చూడండి తెలస్తుంది. మామూలుగా ఉండే గాయకుడు (సర్వదమన బెనర్జీ) ఒక్కసారిగా పేరు ప్రఖ్యాతలు గల మహాగాయకుడై తన స్వగ్రామం వచ్చి నపుడు పాత వంధువులంతా ఎలాంటి అనుభూతికి లోనయ్యారో ఆ అనుభూతిని, తెరమీదకి ఎక్కించిన విశ్వనాథ్‌గారు నరనారాయణుల సంబంధాన్ని గీతలో ఈ శ్లోక యుగళం ద్వారా ఆకలింపు చేసుకొనే ఉంటారు.

వెన్నతిని, మన్నుతిని, అమ్మచేత తన్నులు తిని, ఏడ్చి, ఏడ్పించి, రోజుకో తగవును ఇంటి మీదికి తెచ్చి,

గోపికల చీరలు దొంగిలించి, చిలిపి - తులిపి పనులు చేసిన సాదాసీదా కృష్ణుడు, ఇలా ఇంత విపులంగా వివరంగా, విషయాన్ని విశ్లేషించి, వివరంగా వినిపిస్తుంటే అర్జునుడు అవాక్కైపోయాడు. అందునా విశ్వాన్నీ, కాలాన్నీ, కాలగమనాన్నీ - భూతభవిష్యద్వర్తమానాలను - ఇంత సూక్ష్మంగా సమగ్రంగా, పరిపూర్ణమైన అవగాహనతో చెబుతుంటే ఆశ్చర్యపోయి 'నన్ను మన్నించుబావా' అంటున్నాడు. "ఈ సమస్త జగత్తులోని స్థావర జంగమ (స్థిర, చర) విషయాలకు నీవే తండ్రివి, నీవే పూజనీయుడివి. నీవే ముఖ్యుడివి. నీవే ఆధ్యాత్మిక ఆచార్యుడవి. నీతో సమానుడు ఎవడూలేడు. ఈ మూడు లోకాలలో నీకంటే గొప్పవాడు లేడు.

**శ్లో॥ పితాఽసి లోకస్య చరాచరస్య త్వమస్య పూజ్యశ్చ గురుర్గరీయాన్।**
**న త్వత్సమోఽస్త్యభ్యధికః కుతోఽన్యో లోకత్రయేఽప్యప్రతిమప్రభావ॥**
**(11-43)**

కాలానికీ, కర్మకు (పనికి) మానవ రూపంగా భాసించే, ప్రతీకగా వెలుగొందే కృష్ణుడిని గురించి ఇపుడు సంపూర్ణంగా అర్జునుడు తెలుసుకున్నాడు. ప్రతి వ్యక్తీ భౌతికంగా కాలాగ్ని గర్భంలో సమసిపోవలసిందేననీ, ప్రతివ్యక్తీ అతడు చేసిన కర్మ (పని) ద్వారా శాశ్వితుడు అవుతాడని తెలుసుకున్నాడు.

అర్జునుడే కాదు అర్జునునితోబాటు మనమూ తెలుసుకున్నాం. మనకు వేల, లక్షల, కోట్ల జనం కాల గర్భంలో కలసిపోయారనీ, ఒక గాంధీ, నెహ్రూ, ఏసు, సొక్రటీస్, ప్రవక్తమహమ్మద్, మహావీరుడు, బుద్ధుడు... వంటి అతి కొద్దిమంది మాత్రం తమతమ రంగాలలో చేసిన కర్మ (పని) వల్ల శాశ్వితులైనారనీ తెలుసుకున్నాం . (కనీసం ఇది చదివిన తరువాతనైనా మనం ఒక కఠోరమైన వజ్రసంకల్పాన్ని మనముందు ఉంచుకొని, దాని సాధనకు అహోరాత్రులు ఆకలి దప్పులకు అతీతంగా మనం కృషి చేద్దాంగాక).

ఓ కృష్ణా నీవు ప్రతి జీవికీ పూజ్యనీయుడవు. నీ ముందు నేను సాష్టాంగపడి ప్రణమిలుచున్నాను. తండ్రి కుమారుడి లోపాలను, మిత్రుడు తన సహచరుని లోపాలను, ప్రియుడు తన ప్రియురాలి లోపాలను సహింపను.

**శ్లో॥ తస్మాత్ ప్రణమ్య ప్రణిధాయ కాయం ప్రసాదయే త్వామహమీశమీడ్యమ్।**
**పితేవ పుత్రస్య సఖేవ సఖ్యుః ప్రియః ప్రియాయార్హసి దేవ సోఢుమ్॥**
**(11-44)**

అధికుడు అధముణ్ణి, పెద్దవాడు చిన్నవాడిని, మిత్రుడు సహచరుణ్ణి, ప్రియుడు ప్రేయసిని జాగ్రత్తగా చూచుకుంటూ లోపాలను సహించి, భరించి, తొలగించి ప్రేమ పంచాలన్న పరమ సత్యం ఈ శ్లోకం వలన లోకానికి తెలుస్తున్నది ఈ విధంగా గీతా సామాజిక శాస్త్రం. (సోషియాలజీ) కూడా అయింది. పైవాడు క్రిందివాడిని ప్రేమించాలి. క్రిందివాడు పైవాడిని గౌరవించాలి.

"ఇది వరకూ ఎప్పుడూ చూడని ఈ ఉగ్రరూపాన్ని ఉపసంహరించు. నాకు భయం వేస్తున్నది. నీ పూర్వరూపాన్ని నాకు అనుగ్రహించు" అన్నాడు అర్జునుడు.

ఇది కూడా చాలా సహజమే. ప్రహ్లాదుణ్ణి కనికరించడానికి, హిరణ్యకశ్యపుణ్ణి కడతేర్చడానికి వచ్చిన స్తంభోద్భవుడైన జ్వాలామహోగ్రనారసింహరూప భయంకరం. ప్రసన్న చిద్విలాస విశరూపం ఆమోద యోగ్యం ఆమోదకరం "విధాతాదు లే వెరపుచెందునీ ఉగ్రరూపమును ఉపశమింపుమా" అన్న ప్రహ్లాదుని భావంకూడా గీతావాక్యమే. మహిషాసురుణ్ణి మర్ధించడానికి రూపందాల్చిన కాళీమాత భయద సౌందర్యం కంటే ప్రసన్న ఇష్టకామేశ్వరి ప్రజలకు మరింత వందనీయం అవుతుంది. నిజానికి - ఈ

విశ్వరూప ప్రదర్శన కృష్ణుడికి మొదటి పర్యాయంకాదు. అర్జునుడికి మొదటిదే. రాయబారం నడుపుతున్న కృష్ణుణ్ణి దుర్యోదనాదులు బందించబూనినప్పుడు, కృష్ణుడు తన విశ్వరూపాన్ని ప్రదర్శించి, దృతరాష్ట్రుడికి తాత్కాలికంగా చూపునిచ్చి, తానేమిటో నిరూపించాడు. కాకపోతే ఆ సన్నివేశంలో అర్జునుడు లేడు. అందుకే కృష్ణుణ్ణి ఇలా చూడడం అర్జునుడికి మొదటిసారి. అందుకే భయంవేసి ఉండవచ్చు (కళ్లున్న మూర్ఖులు దుర్యోధనాదులు చూడలేక పోయారు. జ్ఞానులైన భీష్మద్రోణాదులు కృష్ణుడి విశ్వరూపం సందర్శించగలిగారు. "పుత్రవ్యామోహం" అనే గుడ్డితనంతో చెడిపోయిన ధృతరాష్ట్రుడు మాత్రం ఒక్కక్షణం "కర్మ" (పని) కి గల గొప్పతనాన్ని (కృష్ణుడి విశ్వరూపాన్ని సందర్శించగలిగాడు) అందుకే "నీ పూర్వరూపాన్ని చూపించు జగన్నివాసా" అని అర్జునుడు అడిగాడు.

**అదృష్టపూర్వం హృషితోఽస్మి దృష్ట్వా భయేన చ ప్రవ్యథితం మనో మే।**
**తదేవ మే దర్శయ దేవరూపం ప్రసీద దేవేశ జగన్నివాస॥ (11-45)**

ఇన్ని చేతులు, ఇన్ని తలలు... ఇలా నిన్ను చూడలేను. కనీసం చతుర్భుజాలతో కనిపించు... కిరీటంతో, గదతో, చేతులో చక్రంతో ఉన్న రూపాన్ని చూపించు. వేయి చేతులతో కనబడే దేవా నాలుగు చేతులతో కనిపించు. నిన్ను ఆ రూపంలో చూడాలనుకుంటున్నాను.

**కిరీటినం గదినం చక్రహస్తమ్ ఇచ్ఛామి త్వాం ద్రష్టుమహం తథైవ।**
**తేనైవ రూపేణ చతుర్భుజేన సహస్రబాహో! భవ విశ్వమూర్తే! ॥ (11-46)**

ఈ శ్లోకం ఈనాటికి కూడా నిత్య నూతనంగా తాజాగా ఉంటుంది. "ఈ వికృత రూపం వద్దు. అందరికీ ఆమోదయోగ్యమైన రూపం ప్రదర్శించు" అన్నదే దీని సారాంశం. అంటే రూపానికి అంత ప్రాధాన్యత ఉన్నదన్నమాట. ఈనాడు కూడా ఒక డాక్టరు, ఒక లాయరు, ఒక పోలీసు, ఒక మిలిటరీవాడు, ఒక పూజారి, ఒక క్రిస్టియన్ ఫాదరు, ఒక దర్గాలోని ముల్లా, ఒక డ్రైవరు, ఒక పారిశుద్ధ్య కార్మికుడు... ఆయా రూపాలలోనే నాకు కనిపిస్తారు. అలాఉంటేనే మనం కూడా వారిని గౌరవిస్తాం.

మొన్న ఈ మధ్య జరిగిన సంఘటన ఒకటి ఉదహరిస్తాను.

నేను ఒంగోలు నుండి కర్నూలుకు వస్తున్న బస్సులో ఒక త్రాగుబోతు ఎక్కి బస్సు డ్రైవరుతో గొడవ పడుతున్నాడు. డ్రైవరు ఎంతో ఓపికతో సమాధానపరుస్తున్నాడు. అయినా ఆ త్రాగుబోతు కొరెక్కుతూ ఉన్నాడు. ప్రయాణీకులు సరిచెప్పబోతున్నా వినడంలేదు. అంతలో చివరి సీట్లో ఉన్న డ్రస్సులో వున్న ఒక పోలీసు ( ఏ స్టేషనుకు సంబంధించిన ఉద్యోగో తెలియదు) వచ్చి "ఏం రా ఒళ్లెలా ఉంది" అని గద్దించే సరికి నోరుమూసుకొని కాలికి బుద్ధి చెప్పేశాడు. " ఆ పోలీసు ఏ స్టేషనువాడు, అతనికి ఈ పోలీసు స్టేషను పరిధిలో గదమాయించే అధికారం ఉందా, ....." ఇలాంటి వేవీ త్రాగుబోతు మనసులోకి రాలేదు. కేవలం పోలీసు డ్రస్సు (వేషం) చూసి వాడు దారిలోకి వచ్చాడు. కాబట్టి ప్రతి వ్యక్తీ (చివరకు దేవుడైనా సరే) తగిన వేషంలోనే కనిపించాలి. అందుకే అర్జునుడు కూడా "ఈ విపరీత రూపం వద్దు. చతుర్భుజరూపం చూపించు" అన్నాడు.

ఇంతగా అర్జునుడు వేడుకున్నప్పుడు - "అర్జునా నీ మీద ఉన్న ప్రేమతో అభిమానంతో నీకు నేను నా విశ్వరూపాన్ని-కాలరూపాన్ని, కర్మ రూపాన్నీ - చూపించాను.అంతంలేనిదైన, మొట్టమొదటి దైన రూపాన్నీ నీవే, చూడగలిగావు "కాలం అంటే ఏమిటో నీకు 'రూపం' కల్పించి చూపించాను. ఇంతవరకు ఎవ్వరూ ఎప్పుడూ దీన్ని చూడలేదు" అన్నాడు.

# యజ్ఞాలు - భారతీయత

..... బ్రహ్మశ్రీ బొడ్డుపల్లి పవన్‌కుమార్ అవధాని

భారతదేశమంటే మహర్షుల తపోభూమి. శీతోష్ణాలనీ సుఖదుఃఖాలనీ సమంగా పరిగణిస్తూ హోమాది కర్మల నాచరిస్తూ పరమాత్మని అంతటా దర్శిస్తూ, భగవంతుని అనుభూతికి వ్యక్తి గతంగా లోనవుతూ సమాజంలో ప్రాకృతిక, మానసిక వాతావరణాలపై ఆ ప్రభావాన్ని చూసి సకల జీవరాశికి కూడా సుఖశాంతులు పొందేలాగా మన మహర్షులు మనకు గొప్ప వారసత్వాన్ని అందిస్తున్నారు.

అతివృష్టి అనావృష్టి ఏదైనా ప్రమాదకారే. శ్రీమద్వాల్మీకి రామాయణంలో రోమపాదుడు తన సామ్రాజ్యంలో అనావృష్టి బాధా నివారణకు ఋష్యశృంగుడ్ని ఆహ్వానించడం, శ్రీరామచంద్రుడు అరణ్యాలలో ఋషులకు అభయ హస్తాన్ని అందించడం అశ్వ మేధయాగాది క్రతువులు నిర్వహించడం భగవద్గీతలో శ్రీకృష్ణ పరమాత్మ యజ్ఞాదికంగా, మానసికానందాన్నీ, శారీరక సౌఖ్యాన్నీ ఇచ్చి ప్రకృతి ద్వారా సమాజానికి ఎట్లా ఉపకరిస్తాయో తెలుపుతూ, పరమాత్మ తత్వం బోధపరుస్తుంది.

**వాతావరణ ప్రభావం - హోమావశ్యకత :**

వాతావరణంలో ఏ విధమైన మార్పు సంభవించినా, అది వెంటనే ప్రాణం మీద ప్రభావం చూపుతుంది తద్వారా మనస్సుపై దాని ప్రభావం పడుతుంది. ప్రాణం - మనస్సు అనేవి ఒకే నాణెంలో బొమ్మ - బొరుసులాంటివి కదా! మనం అగ్నిని ప్రేరేపించినప్పుడు వాతావరణంలో మార్పు కలగడం సహజం. మంత్రోచ్చారణ చేసినప్పుడు తప్పక ప్రకంపనాలు వాతావరణంలో ప్రయాణిస్తాయి. వల్లించే మంత్రాలూ అగ్నికి సమర్పించే ఆజ్యాలూ, జనించే హోమ ధూమమూ చేరి వాతావరణంలో మార్పు తప్పక ఏర్పడుతుంది. వాతావరణ కాలుష్యం పోగొట్టి ఆ ప్రదేశాన్ని ఆరోగ్య ప్రదం చేస్తుంది.

**మంత్రంతో హోమం - మననాత్ త్రాయతే ఇతి మంత్రః**

మననం చేస్తుంటే రక్షించేది అని మంత్రానికి అర్థం. మంత్రంలోని, అక్షరాల శక్తి మనిషిలోని అంతర్గత శక్తిని ప్రేరేపిస్తుంది. మానవ శరీర మందు ఒక్కొక్క భాగానికీ ఒక్కొక్క అధిదేవత వుంటుంది. ఆయాదేవతా మంత్రాల ప్రభావం, శరీరంలోని ఆయా భాగాల మీద పడుతుంది.

వేదమంత్ర ప్రభావం మనసూక్ష్మ గ్రంధులపైనా, షట్చక్రాలపైనా, శక్తి కేంద్రాల పైనా సూటిగా పడుతుంది. అప్పుడు సూక్ష్మ జగత్‌శక్తి కేంద్రం జాగృతమౌతుంది. మంత్రశబ్దాలు వాటికి సంబంధించిన యౌగిక గ్రంథులకు చలనం కలిగిస్తాయి. పోగొట్టుకున్న శక్తిని మేల్కొలుపుతాయి. చెవికి సంబంధించిన నరాలపై ప్రభావం చూపి, ఆ నరాలకూ, మెదడుకు నేరుగా సంబంధం ఉండటం చేత మెదడు మూలంగా శరీర మందలి అన్నీ అంగాలకూ సంపర్కం వుండటంతోనూ, వినేవారిపై మంత్రోచ్చారణ నుండి ఉద్భవించిన శబ్దతరంగాల ప్రభావం పడి తీరుతుంది.

అర్ఘ్య ప్రధాన ప్రక్రియలో నీటిని మంత్రంతో వదలితే ఆశబ్ద తరంగాలు పౌరాణికంగా మందేహులనే రాక్షసులను పడగొడుతూ సూర్యుడికి అడ్డు తొలగించే అస్త్రాలుగా ప్రస్తుత విజ్ఞాన శాస్త్రపరంగా

ప్రమాదకారియైన అతినీల లోహిత కిరణాలు భూమిని చేరకుండా ఓజోన్ పొరలను కాపాడుతూ గట్టి పరుస్తాయి. వేదమంత్రాలను చదువుతూ హోమం చేయడం వల్ల రెండు ప్రయోజనాలు కనిపిస్తాయి. హోమ లాభాలని విశదపరిచే వ్యాఖ్యలవల్ల విషయ పరిజ్ఞానం ఒకటైతే, శబ్దతరంగాల వ్యాప్తి రక్షణ మరొకటి.

శ్లో॥ అన్నాద్భవన్తి భూతాని పర్జన్యాదన్న సంభవః
యజ్ఞాద్భవతి పర్జన్యోయజ్ఞః కర్మ సముద్భవః
కర్మబ్రహ్మోద్భవంవిద్ధి బ్రహ్మాక్షర సముద్భవమ్
తస్మాత్సర్వగతం బ్రహ్మ నిత్యం యజ్ఞే ప్రతిష్ఠితమ్॥

అన్నంవల్ల ప్రాణులు కలుగుతాయి. అన్నం మేఘం వల్ల కలుగుతుంది. మేఘం యజ్ఞం వల్ల, యజ్ఞం సత్కర్మల వల్ల కలుగుతుంటే సత్కర్మ వేదం వల్ల కలుగుతుంది. ఆ వేదం అక్షర పరబ్రహ్మ వల్ల కలుగుతోంది కాబట్టి సర్వ వ్యాపక బ్రహ్మము నిరంతరం యజ్ఞం నందు ప్రతిష్ఠింపబడే దానిలాగా ఎరుంగవలెనని దీని భావం. యజ్ఞం వల్ల వర్షం కురుస్తుంది అనే విషయాన్ని బట్టి యజ్ఞాదుల ప్రభావం వల్లనే కరువు కాటకాలు ఏర్పడతాయనే విషయం స్పష్టమవుతోంది. కాబట్టి దేశసౌభాగ్యం కొరకు, ఆత్మశుద్ధి కొరకు జనులు యజ్ఞాది సత్కర్మలని విరివిగా ఆచరించాలి.


**హోమ ఫలితం - పాపం :**

దుర్గంధయుక్తమైన జలవాయువుల వల్ల రోగాలూ తద్వారా ప్రాణులకు దుఃఖమూ కలుగుతుంది. ఈ విషయం ప్రస్తుత యాంత్రిక జీవితంలో వాతావరణ కాలుష్యం స్పష్టపరుస్తోంది కదా!

గంధాన్నరగదీసి ఇతరులకు పూయడం చేతనూ నెయ్యి మున్నగునవి భుజించడం ద్వారాను మిక్కిలి ఉపకారమౌతుందని, నిప్పులో పోసి వృధాగా పాడు చెయ్యడం బుద్ధిమంతుల పని కాదనీ పలువురు పేర్కొంటారు. పదార్థ విజ్ఞానం తెలిస్తే వారు ఇలా అనరు. ఏ ద్రవ్యమూ అభావం కాజాలదు. హోమం చేస్తున్నప్పుడు దూరంగా వుండే ప్రాణులు కూడా తమ ముక్కుతో సుగంధాన్ని పీలుస్తాయి. కాబట్టి అగ్ని యందు వేయబడిన పదార్థం సూక్ష్మమై వాయువుతో కలిసి దూరం వ్యాపించి దుర్గంధాన్ని నివర్తింపజేస్తుందని తెలుస్తుంది. ఈ ప్రక్రియ చంటి పిల్లలకు సాంబ్రాణి పొగ వేయడంతో ప్రారంభమౌతుంది. కుంకుమ పువ్వు, కస్తూరి, పరిమళ పుష్పాలు, అత్తరు మొ॥నవి వాటి ఇండ్ల యందు వుంచడం చేత వాయువు సుగంధ యుక్తయై సుఖకరమౌతుందని అనుకోవడానికి వీలులేదు. ఎందువలెనంటే, అట్టి సుగంధానికి గృహమందుండే వాయువును వెలువరించి శుద్ధవాయువును లోపలికి ప్రవేశింపజేసే సామర్థ్యంలేదు. ఈ సుగంధాలకు భేదక శక్తి లేకపోవడమే దీనికి కారణం. వాయువునూ దుర్గంధ పదార్థాలనూ వేరుచేసి తేలిక పరిచి వెలుపలికి వెడల గొట్టి శుద్ధమైన వాయువును ప్రవేశింపజేసే సామర్థ్యం అగ్ని యందేవున్నది. ఏ మానవుడి శరీరం నుండి ఎంత దుర్గంధం ఉత్పన్నమై వాయువునూ, జలాన్నీ చెఱిపి రోగోత్పత్తికి కారణమై ప్రాణులకు ఎంత దుఃఖం కలిగిస్తుందో అంత పాపం ఆ మానవునికి కలుగుతుంది. ఆ పాప నివారణార్థమై అంతగానీ, అంతకంటే ఎక్కువగానీ సుగంధాన్ని జలవాయువు లందు వ్యాపింపజేయాలి. ఒకడు తినగలిగిన నేతినీ, సుగంధపదార్థాలనీ హోమం చేస్తే అనేక జీవులకు ఉపకారమౌతుంది.

ప్రతి మనిషి పదునాఱు ఆహుతులీయాలి. నెయ్యి మొదలైన వాటితో కూడిన ప్రతి ఆహుతి కనీసం ఆరుమాషల (అరతులం) ఎత్తుండాలి. ఇంతకంటే ఎక్కువగా చేస్తే మరింత మంచిది. ●

# శ్రీరామ భక్తి



## 5. వసిష్ఠ మహర్షి శ్రీరామ భక్తి

- కీ.శే డాక్టర్ రోహిణివెంకటసుందరవరదరాజేశ్వరి

బ్రహ్మ మానస పుత్రుడైన వసిష్ఠ మహర్షి తపః స్వరూపుడు క్షమామూర్తి. ఇతని ఆవిర్భావ కథ వివిధ పురాణములలో పలురకములుగానున్నది. కొన్నింటిలో బ్రహ్మమానస పుత్రుడనియు, ఆగ్నేయ పుత్రుడనియు, మిత్రావరుణ పుత్రుడనియు చెప్పబడినది. కల్ప భేదముతో చూచిన ఇవి అన్నియు సత్యమైనవే. వసిష్ట మహర్షి సప్తఋషులలో ప్రధానుడు. అద్వైత సంప్రదాయ పరంపరలో మూడవవాడు.

"నారాయణం పద్మభువం వసిష్ఠమ్". అద్వైత వేదాంత సమస్త గ్రంథములకు మూలమైన యోగవాసిష్ఠ గ్రంథము వసిష్టునిదే. సతీశిరోమణి భగవతి అరుంధతి ఇతని పత్ని. ఈమె సప్తర్షి మండల సమీపమున పతిసేవ యందు నిమగ్నమైయుండును. ఆ మహర్షి వసిష్ఠ సంహిత యందు కర్మమహత్త్వమును, ఆచరణ యొక్క ఆదర్శమును స్థాపించెను. ఇతిహాస పురాణములయందు ఇతని మహనీయోజ్వల చరిత్ర బహువిస్తారముగా నున్నది.

సాక్షాత్తుగా బ్రహ్మ స్వరూపుడగు శ్రీరామ భగవానుని చరణములపై వసిష్ఠ మహర్షి భక్తి జన్మ జన్మాంతరములది అయినను ఈ అవతారము నందు రామ దర్శనాభిలాష ఆయనకు అతి తీవ్రమయ్యెను. అది గ్రహించి తండ్రి అయిన బ్రహ్మ "కుమారా! నీవు ఇక్ష్వాకుల పౌరోహిత్యము స్వీకరింపు " మనెను. కాని వసిష్ఠునికా పని ఇష్టములేకుండెను. పురోహిత పదవి శ్రేష్ఠమైనది కాదని తలచెను. దీనిలో విషయ భోగలాలసతధన లోభముండునని స్వీకరించుటకు ఇష్టపడలేదు.

సర్వజ్ఞాని సర్వజ్ఞుడైన బ్రహ్మ ఇది గ్రహించి "కుమారా! నీవు ఆ విధముగ ఎందుకనుకొందువు ? నీ పరమ ధ్యేయుడు పరబ్రహ్మ పరమాత్ముడు రాముని రూపమున ఈ వంశమందే ప్రాదుర్భావమగును. వానిని దర్శించుటే కద నీ అభిలాష. అందుచేత ఈకార్యమందు నీకు లాభమేగాని హానిలేదు.

నీ ఆరాధ్య దైవమైన శ్రీరామునకు గురువుగా గౌరవమైన పదవిని పొంది కృతార్థుడవగును. నీ కోరిక సిద్ధించును" అని చెప్పెను.

తండ్రి మాటలు వినిన వసిష్ఠుడు అత్యంత ప్రసన్నుడై "తండ్రీ! సమస్త యోగ సాధన, యజ్ఞదాన స్వాధ్యాయ జపతపములు తీర్థసేన శుభకర్మల ఫలములు ఇవన్నియు భగవత్ప్రాప్తి కొరకే అయినప్పుడు, సూర్యవంశాచార్యత్వము వంటి సుఖమయ కార్యము చేయుట ప్రాప్తమైన, అంతకంటే అధిక లాభమైనది నాకు ఇంకేముండును?" అనుచు తండ్రి మాటను సంతోషముగ స్వీకరించెను.

వసిష్ఠుని జీవనమే రామమయము. సదా వాని భక్తి, ఉపాసనలందే మునిగి యుండును. వసిష్ఠుడు రామునితో "ప్రభూ! కర్మకాండాది సాధనములతో సాధకునికి జ్ఞానోదయముగాదు. మీ చరణారవిందములపై యుండు అనురాగ భక్తియే ఆత్మజ్ఞానమును గలిగించును. జలమును చిలికి

ఎవ్వరైన నెయ్యిని పొందగలరా ? అట్లే రఘునాథా! భక్తియను నిర్మల జలముతోనే అన్తః కరణము వృద్ధియగును" అనెను. (రామ చరిత మానసము)

శ్రీరాముని చరణ కమలముల సేవలో నిరంతరముండు తపస్యులకు అనేక జన్మల సంచిత మనోమలినము వెనువెంటనే శనించును. రాముని చరణముల నుండి ఉద్భవించిన శ్రీగంగ స్వచరణాశ్రముల మనో మలినమును తొలగించి జ్ఞానుల గావించి సంసార చక్రమున పడకుండ కాపాడును. అందువలన మనోవాక్కాయ కర్మలచే రాముని భజించవలెను. (శ్రీమద్భాగవతము)

వసిష్ఠ మహర్షి భగవానుని భక్తి మహిమను వర్ణించుచు "ప్రభూ! నిరంతరము మీ చరణ కమలములపై వర్ధమాన ప్రేమను గలిగియుండు వారే నా దృష్టియందు త్రికాలజ్ఞులు, సర్వజ్ఞులు, తత్త్వజ్ఞులు, హర్శజ్ఞులు, పండితులు, విద్వాంసులు. వారే సమస్త గుణాగారములు అఖండ జ్ఞాన విజ్ఞాన భండారులే. వారే సమస్త లక్షణ యుక్తులు. భగవంతుని చరణములపై ప్రీతిలేక సర్వజ్ఞత్వాధి గుణములు గలిగియున్నను అవి వ్యర్థములు. అందువలన శ్రీహరి చరణములపై ప్రేమగలిగి యుండుగ సర్వశ్రేష్ఠము" అనెను.

ఈ రహస్యము తెలిసిన వాడు గనుకనే వసిష్ఠ మహర్షి ప్రభువుని ఇతర కాంక్షలు కోరలేదు. ముక్తికూడ కోరలేదు. కేవలము శ్రీరామునిపై అఖండ భక్తిని మాత్రమే కోరుకొనెను.

"రామా! మీ చరణ కమలములపై ప్రేమ నా జన్మ జన్మాంతరముల యందును ఉండవలెను" అని కోరగా శ్రీరాముడు తన గురువునకు ప్రసన్నుడై అఖండ భక్తి వరమొసగి కృపాపూర్ణుడయ్యెను.

వసిష్ఠమహర్షి అరుంధతో కలసి సప్తర్షిమండల మందు నేటికిని స్థితుడై, శ్రీరామభక్తిలో నిమగ్నుడై జగత్కల్యాణము గావించుచున్నాడు. (రామచరిత మానసము).

---

15 వ పేజి తరువాయి ......

ఉన్నాయి. సృష్టివిద్యతోపాటు పరమేశ్వరుని స్తుతిని తెలిపే పురుషసూక్తం దీనిలో విశిష్టంగా ఉంటుంది. ముఖ్యంగా చివరి 40వ అధ్యాయం ఆధ్యాత్మిక విద్యల సారాంశం. 'ఈశావాస్యమిదం సర్వం' అంటూ ప్రారంభించబడినందువల్ల దీనికి 'ఈశావాస్యోపనిషత్తు' అని పేరువచ్చింది. ఈ జగత్తంతా పరమేశ్వరునిచే వ్యాప్తమై ఉంది. ఇది పరమేశ్వరునిది కనుక త్యాగభావంతో (ఇది నాదికాదు అనడం) న్యాయంగా భోగభాగ్యాలను అనుభవించమంటుంది.

వేదవిహిత కర్మలను చేస్తూనే నూరేళ్లు జీవించగోరమంటుంది. కర్మబంధనాలనుండి విడివడటానికి ఇదొక్కటే మార్గమంటుంది. సర్వసత్కర్మలనాచరించి ఈశ్వరార్పణ గావించమంటుంది. ఈ విధంగా యజుర్వేదం నిష్కామ కర్మయోగాన్ని బోధిస్తుంది.

'ఇష' (అన్నం)తో ప్రారంభమై ఈవేదం 'ఈశ' (పరమాత్మ)తో ముగుస్తుంది. కర్మచే అన్నాన్ని సంపాదించి, జ్ఞానంతో ఈశ్వరుని పొందమంటుంది. యజుర్వేదపు ఆద్యంత శబ్దముల సారాంశమిదియే.

గమనిక : సంపూర్ణ శుక్ల యజుర్వేద భాష్యమునకు మహర్షిదయానందసరస్వతి భాష్యం ముద్రించబడినది. సంస్కృతాంధ్ర టీకాతాత్పర్యములతో పాటు ఆంగ్ల భావార్థ సహితముగా 3 వేల పుటలలో 6 సంపుటములుగా ముద్రించబడినది.

# రఘువంశం



మహాకవి కాళిదాసు
కృతికి భావానువాదం:
డా॥ సముద్రాల లక్ష్మణయ్య,
తిరుపతి

**అజమహారాజు**

ఇలా కౌత్సుడు రఘువును ఆశీర్వదించి గురుని చెంతకు వెళ్లాడు. జీవలోకం సూర్యుని నుండి వెలుగును పొందినట్లే రాజుకూడా అతని దీవెనవల్ల శ్రీఘ్రంగా సుపుత్రుణ్ణి కన్నాడు. ఒకనాటి బ్రహ్మముహూర్తాన పట్టపురాణి కుమారస్వామితో సమానుడైన కుమారుణ్ణి కనింది. అందుచేత రఘుమహారాజు బ్రహ్మకు మారుపేరైన అజశబ్దంతోనే కుమారుణ్ణి పిలిచాడు. దీపమునుండి పుట్టిన దీపం అన్ని విధాలా ఆ దీపాన్నే పోలివున్నట్లు కుమారుడు తేజోవంతమైన రూపంలోగాని, శౌర్యంలోగాని, సహజౌన్నత్యంలోగాని పూర్తిగా తండ్రినే పోలినాడు.

గురువుల వద్ద సకల విద్యలూ నేర్చి యౌవనోదయంలో ఎంతో మనోహరుడైన అజునిపై తనకు కోరికవున్నా రాజ్యలక్ష్మి అతణ్ణి చేపట్టడానకి ధీరురాలైన కన్య తండ్రి అనుమతికై ప్రతీక్షించినట్లు రఘుమహారాజు అనుజ్ఞకై వేచివుండింది.

ఇది ఇలా వుండగా విదర్భరాజైన భోజుడు తన చెల్లెలు ఇందుమతికి స్వయంవరం ప్రకటించి అజుణ్ణి రప్పించడానికై ఆప్తుడైన దూతను రఘుమహారాజువద్దకు పంపాడు. భోజరాజుతో తనకు వియ్యం అపేక్షణీయమనీ, కుమారునకు పెండ్లి యీడు వచ్చిందనీ భావించిన రఘుమహారాజు అజుణ్ణి సైన్యసమేతంగా సకలైశ్వర్య సంపన్నమైన విదర్భరాజధానికి పంపాడు.

అజమహారాజుకు మార్గమంతటా సకలోపచారాలతో కూడిన విడుదులు ఏర్పాటయ్యాయి. అక్కడ జానపదు లాయనకు పెక్కు కానుకలు సమర్పించారు. అంచేత అరణ్యంలో కూడా ఆయన బస చేసిన చోట్లు ఉద్యాన విహార స్థానాలుగానే ఉండినాయి. ఆయన చాలా దూరం పయనించేసరికి సైన్యం బాగా అలిసిపోయింది. జెండాలన్నీ ధూళిధూసరితా లయ్యాయి. ఇంతలో నర్మదానది వారి కెదురయింది. నీటి తుంపరులతో చల్లగా వస్తున్న పిల్లగాలులు సోకి ఆ నదీ తీరంలోని కానుగ చెట్లు నాట్యం చేస్తున్నట్లు కనిపించాయి. ఆ చోట అజుడు సైన్యాన్ని విడిది చేయించాడు.

**ప్రియంవద శాపవిమోచనం**

ఆ నదిలో ఒకచోట నీటిపై తుమ్మెదలు గుంపుగా తిరుగాడుతున్నాయి. అందువల్ల ఆ నీళ్లలో ఒక మదగజం మునిగి వున్నదని తెలియవచ్చింది. పిమ్మట నీళ్లు మదజలాన్ని కడిగివేయటంవల్ల శుభ్రపడిన గోడలవంటి చెక్కిళ్లతో అడవియేనుగు నదిలో నుండి పైకి లేచింది. అది బుక్షవత్పర్వతతటాలలో వప్రక్రీడ సలుపగా కోఱలపై ఏర్పడిన గైరికాది ధాతువుల గుర్తులు నీటి తాకిడికి కరిగిపోయాయి. అయినా ఆ కొండరాళ్ల తాకిడికి మొక్కపోయిన దంతాలూ, వాటిపై ఏర్పడ్డ నల్లని నిలువు గీతలూ దాని క్రీడను వ్యక్తం చేస్తూ వుండినాయి.

గజబంధన స్థానంలోని గడియప్రాకులను విరుస్తున్నదా అన్నట్లు మహావేగంగా తొండం ముడుచుకొంటూ, చాచుకొంటూ పెద్దపెద్ద అలలను సశబ్దంగా పగులగొట్టూ ఆ యేనుగు నదీ తీరంవైపు పయనించింది. అలా వస్తున్న కొండవంటి దాని శరీరవేగానికి ఏటిలోని నీళ్లు ఉరవడిగా గట్టెక్కాయి. అంతట నాచుతీగల గుబుర్లను ఈడ్చుకొంటూ ఆ మత్తేభం తీరం చేరింది.

నీటిలో మునగడంవల్ల క్షణకాల మదజలం ఆగిపోయిన ఆ ఏకాకి వనగజానికి అజుని సైన్యంలోని గ్రామ్యగజాలను చూడగానే మళ్ళీ గండస్థలంనుండి

మదజలం స్రవించసాగింది. ఏడాకుల అరటిపాలవలె గుబాళిస్తున్న ఆ గజమదం సైన్యంలోని ఏనుగులకు సహింపరానిదయింది. ఆ మద ఆఘ్రాణించి అవి మావటీంద్ర అదుపుతప్పి పెడమొగం పెట్టాయి. ఆ వనగజం ధాటికి తట్టుకోలేక గుఞ్జాలు కట్లు త్రెంచుకొని పారిపోయాయి. ఇరుసులు విరిగి రథాలు నేలగూలాయి. యోధులందరూ స్త్రీలను కాపాడటానికి తత్తరపడ్డారు. ఇలా సేనా నివేశమంతా క్షణంలో అల్లకల్లోలమయింది.

అడవి యేనుగును చంపరాదన్న శాస్త్రవచనానుసారం మీదికి వస్తున్న గజాన్ని మరల్చటానికి అజమహారాజు అల్లెత్రాటిని మితంగా లాగి బాణంతో దాని కుంభస్థలాన్ని కొట్టాడు. దెబ్బ తగులగానే అది గజదేహం వదలి సైనికులు విస్తుపోయి చూస్తుండగా ధగధగలాడుతున్న కాంతిపుంజంతో ఆకాశగమనం కల మనోజ్ఞమైన దివ్యశరీరం ధరించింది. ఆపై తన ప్రభావంవల్ల ప్రాప్తించిన కల్పతరు కుసుమాలను రాకుమారునిపై చల్లి దంతకాంతులతో ఎదలోని ముక్తాహారాల కాంతి నినుమడింప జేస్తూ మాట నేర్పరి అయిన ఆ దివ్య పురుషుడు ఇలా అన్నాడు.

"నేను ప్రియదర్శనుడనే గంధర్వరాజు కుమారుణ్ణి. నన్ను ప్రియంవదుడంటారు. నా గర్వానికి కోపించి మతంగమహర్షి ఏనుగవు కమ్మని నన్ను శపించాడు. పిమ్మట నేను ప్రణమిల్లి వేడుకోగా శాంతించి ఆ మహర్షి నాపై సహజమైన కనికరంచూపాడు. నీటికి నిప్పువల్లా, ఎండవల్లా వేడి కలుగుతుంది. అసలు దాని సహజస్వభావం చల్లదనమే కదా!

"ఇక్ష్వాకు వంశజుడైన అజుడు బాణంతో ఎప్పుడు నీ కుంభస్థలాన్ని చీలుస్తాడో, అప్పుడు ప్రభావ సంపన్నమైన నీశరీరం నీకు తిరిగి వస్తుంది" అని చెప్పి ఆ తపోనిధి నన్ను అనుగ్రహించాడు. నేను చిరకాలం నుండి నీ దర్శనంకోసం ఎదురుచూస్తున్నాను. సత్త్వసంపన్నుడవైన నీవు ఇప్పుడు నన్ను శాపంనుండి విముక్తుణ్ణి చేశావు. ఇందుకు తగిన ప్రత్యుపకారం నేను నీకు చేయకపోతే పూర్వస్థితి నాకు లభించడం వ్యర్థమే కదా!

మిత్రమా! నావద్ద 'సమ్మోహనం' అనే గంధర్వదేవతాకమైన అస్త్రం ఉంది. దాన్ని ప్రయోగించడానికీ, ఉపసంహరించడానికీ వినియోగపడే మంత్రాలున్నాయి. అది ప్రయోగించే వాడికి శత్రుహింస కలుగదు సరికాదా, విజయం హస్తగతమై తీరుతుంది. అది నీకిస్తాను. పరిగ్రహించు, నన్ను కొట్టినందుకు నీవు సిగ్గుపడవద్దు. కొడుతూ గూడా నాపై ఒకింపుక దయ చూపావు. నీదెబ్బవల్ల నాకు మహోపకారమే జరిగింది. అందుచే నా ప్రార్థనను తిరస్కరించే పారుష్యం చూపవద్దు."

అస్త్రజ్ఞుడూ, పురుషశ్రేష్ఠుడూ అయిన అజమహారాజు అందుకంగీకరించి పవిత్రమైన నర్మదా జలంతో ఆచమనం చేశాడు. పిమ్మట ఉత్తరాభిముఖుడై శాపవిముక్తుడైన గంధర్వుని వలన సమ్మోహనాస్త్రాన్ని సమంత్రకంగా స్వీకరించాడు. ఇలా దైవయోగాన దారిలో వారిద్దరికీ కారణ మూహింపరాని చెలిమి కలిగింది. పిమ్మట వారిలో ఒకడు కుబేరుని ఉద్యానమైన చైత్రరథానికి పోయాడు. మరొకడు మంచిరాజు ఏలుబడితో మనోజ్ఞమైన విదర్భదేశానికి వెళ్ళాడు.

అజమహారాజు నగరం పొలిమేరలో వచ్చి నిలువగానే అతని రాకకు ఎంతో హర్షించిన విదర్భరాజు అలలతో ఉప్పొంగే సముద్రుడు చంద్రుడి కేదురేగినట్లు అతని ఎదురుగా వెళ్ళాడు. అలా వెళ్ళి వినయపూర్వకంగా అజుణ్ణి ఆహ్వానించి తాను ముందు నడుస్తూ పురప్రవేశం చేయించాడు. అతనికి పలు కానుక లర్పించి వివిధోపచారాలు చేశాడు. పట్టణం చేరిన జనులు ఆ ఉపచార పద్ధతులన్నీ చూచి అజుడే ఇంటి యజమానుడనీ, భోజుడే అతిథి అనీ భావించారు.

విదర్భరాజు నియోగించిన అధికారులు

రఘుమహారాజుతో సమానుడైన అజమహారాజుకు నమస్కరించి తూర్పువాకిటి అరుగు మీద మంగళపూర్ణకలశం నిలిపిన విడిది యిల్లుచూపారు. మదనుడు యౌవనాన్ని ప్రాప్తించినట్లు అజుడు మనోజ్ఞమైన ఆ రాజభవనాన్ని అధిష్ఠించాడు.

అనేక దేశాలనుండి పలువురు రాజులు ఇందుమతీ స్వయంవరంలో పాల్గొనడాని కరుదెంచారు. అజుడు కమనీయమైన ఆ కన్యారత్నాన్ని తనదానిగా చేసుకోగోరి ఆ తలంపులతోనే ఆ రాత్రి శయనించాడు. ప్రియుని తమకం తెలియనేరని ప్రేయసిలాగా చాలా సేపటికి గాని అతని కంటికి నిద్ర రాలేదు. బలిసివున్న అతని అంసతలంమీద తెల్లవారేసరికి కర్ణకుండాలాలు ఒత్తుకొన్నగుర్తు లేర్పడ్డాయి. పాన్పుమీది వలువ ఒరపిడికి మైపూత చాలా వరకూ రాలిపోయింది ఆ ప్రజ్ఞావంతుణ్ణి ఉషఃకాలంలో సమవయస్కులూ ప్రౌఢవచస్కులూ అయిన వైతాళికులు ఈ విధమైన స్తుతిపాఠాలతో మేల్కొలిపారు.

"బుద్ధిమంతులతో శ్రేష్ఠుడవైన ఓ అజమహారాజా! ఇదిగో తెల్లవారింది పాన్పునుండి లెమ్ము! బ్రహ్మదేవుడు భూభారాన్ని మీ యిరువురికొరకై రెండు సమభాగాలుగా విభజించాడు. అందులో ఒక భాగాన్ని మీ తండ్రి జాగరూకుడై వహిస్తున్నాడు. తక్కిన భాగాన్ని నీవు మోయవలసివుంది. కాబట్టి మేలుకో! నీవు నిద్రాదేవి కధీనుడవు కావడంవల్ల లక్ష్మీ నీపై యీసు వహించింది. ఖండిత నాయికలాగా ఆమె నీమీద అనురక్తి నుపేక్షించి నీవదనంతో పోలికగల చంద్రుడితోకూడి ఇప్పటిదాకా వినోదించింది. ఇప్పుడాచంద్రుడు కూడా పడమటి దిక్కుచేరి నీముఖ కాంతిని కోల్పోయాడు.

ఇప్పుడే తమ్మిలోపల తుమ్మెద కదలుతున్నది. నీకంటిలోని కనుగ్రుడ్డుకూడా చలిస్తున్నది. ఇవిరెండూ ఒకేసారి వికాసం పొంది పరస్పర సామ్యానికి సమగ్రతను సమకూర్చుకొనుగాక! సహజసిద్ధమైన నీ నిట్టూర్పు తావిని తాను కృత్రిమంగా ఇతర పదార్థాలనుండి సంపాదించుకొన గోరినదా అన్నట్లు ప్రభాతవాయువు చెట్ల తొడిమలనుండి సడలిన పూలను హరిస్తున్నది. ప్రొద్దుపొడుపున వికసించిన పద్మాలతో కలుస్తున్నది. పులు కడిగిన ముత్తెపు పూసలలాగా స్వచ్ఛమైన మంచునీరు చెట్ల చివుళ్ల ఎఱుపైన లోపలి భాగంలో పడి ఉత్కర్ష పొంది దంతకాంతితో కూడి నీకెమ్మోవిపై నెలకన్న చిరునవ్వులా విలసిల్లుతున్నది.

తేజోనిధి అయిన సూర్యుడు ఉదయించక ముందే అసూరుడు చీకటి తొలగించాడు. కదనరంగంలో వీరుడవైన నీవు ముందుకు వెళ్ళుతూ వుంటే శత్రువులను మీ తండ్రి తానుగా హతమారుస్తాడా? ఇరువైపులా పరుండి రాత్రి నిద్ర తీర్చుకొన్న నీయేనుగులు గలగలమనే గొలుసుల నీడ్చుకొంటూ పడక విడుస్తున్నాయి. బాలభానుని ఎఱ్ఱని కాంతి సోకిన వాటికో ఱమొగ్గలు మనశ్శిలాది ధాతువులతోడి కొండగట్లతో గోరాడినవిలా ప్రకాశిస్తున్నాయి.


"పద్మాక్షుడా! పొడవైన గుడారపు సాలల్లో కట్టివేసిన వనాయుదేశపు గుఱ్ఱాలు నిద్రవీడి తమముందున్న సైంధవలవణ శకలాలను నోటి వేడితో మలినం చేస్తున్నాయి. పూలు వాడిపోవడంవల్ల పూజామాల కూర్పు సడలిపోయింది. దీపాలు క్రమంగా వెలవెల బారుతున్నాయి. నిన్ను మేల్కొల్పడానికై మేము పాడుతున్న పాటలను మధురస్వరంతో ఈ నీ పంజరపు చిలక మాతో కలిసి పాడుతున్నది."

పైవిధంగా వైతాళికులు కావించిన స్తుతులకు వెంటనే నిద్ర మేల్కొని రాయంచల మదమధుర కూజితాలకు మేల్కొని సుప్రతీకమనే దిగ్గజం గాంగసైకత వేదికను వదలినట్లు రాకుమారుడు పాన్పు వదిలాడు. తర్వాత శాస్త్రోక్తమైన ప్రాతఃకాలానుష్ఠానం పూర్తిచేసుకొని నేర్పరులు కావించిన అనుకూలవేషంతో స్వయంవర మండపంలో ఉన్న రాజసమాజం చెంతకు వెళ్ళాడు.

ఆంధ్రప్రదేశ్ - తెలంగాణలలో

# దర్శనీయ దేవాలయాలు - చారిత్రక ప్రదేశాలు

## బ్రహ్మసంవేద్యం (తూర్పుగోదావరి జిల్లా - ఆంధ్రప్రదేశ్)



శ్రీ రోహిణి మహేష్, M.A., L.L.B., కన్నావారి తోట 2వ లైను, 27-9-54, గుంటూరు - 522 004

బ్రహ్మసంవేద్యం ఆంధ్రప్రదేశ్‌లోని తూర్పుగోదావరి జిల్లాలో అమలాపురానికి 36 కి.మీ. దూరంలో ఉంది. నీళ్ళరేవు, మాసాని తిప్ప అనే రెండు కుగ్రామాల సమాహారమే బ్రహ్మసంవేద్యం. గౌతమినది సాగరంలో కలిసే ప్రదేశవే ఈ బ్రహ్మసంవేద్యం. బ్రహ్మసంవేద్యంను మత్స్యకార్లు బ్రహ్మసముద్రంగా పిలుస్తారు. ఇక్కడ శ్రీ బ్రహ్మేశ్వర, శ్రీ భైరవేశ్వర ఆలయాలున్నాయి. నదీజలాల మధ్య చిన్నదీవిలో ఉండే ప్రదేశమ్ సుందరమైన బ్రహ్మసంవేద్యం.

మహాకవిశ్రీనాధుడు ఈ క్షేత్రాన్ని దర్శించినట్లుగా చరిత్రాధారాల వలన తెలియుచున్నది. భీమ్శ్వర పురాణంలో ఈ క్షేత్రాన్ని గురించిన వివరాలున్నాయి.

పూర్వం పల్లం గ్రామానికి చెందిన కొంతమంది జాలర్లు చిర్రయానాం అనే ప్రాంతంవద్ద చేపల వేటకు వెళ్ళారు. వృద్ధ గైతమీ పాయలో చేపలకోసం వలవేయగా శివలింగం, కొన్ని దేవతా విగ్రహాలు దొరికాయి. వాటిని తీసుకొని నీళ్ళరేవు వద్ద చిన్న ఆలయాన్ని నిర్మించారని చెబుతారు. ఆనాటి నుండి నేటి వరకు మత్స్యకారుల ఆరాధ్యదైవం భైరవేశ్వరుడే. జీవన భృతిని కల్పించే దైవంగా ఆయనను పూజిస్తారు. వేటలో అత్యధికంగా చేపలు దొరికితే అది స్వామి వరప్రసాదమని భావిస్తారు. వాటిని అమ్మగా వచ్చిన ఆదాయంలో కొంత భాగాన్ని స్వామికి కానుకగా సమర్పించడం ఇక్కడ సంప్రదాయం.

ఇక్కడ దైవం పార్వతీ సమేత బ్రహ్మేశ్వరుడు. ఆలయంలో గోపాలస్వామి, సుబ్రహ్మణ్యేవ్వరుడు, ఈశ్వరమ్మ విగ్రహాలు కలవు. ఆలయం ముందు భాగంలో చిన్నరాతి స్తంభంపై నంది విగ్రహం ఉంది. ఈ స్తంభానికి చుట్టూ సప్తమహార్షుల శిల్పాలున్నాయి. రజస్వలకాని అమ్మాయిలు ఈశ్వరమ్మ విగ్రహం శిఖరభాగాన రాగినాణేము ఉంచి పూజ చేస్తే వారు తప్పక రజస్వల అవుతారని భక్తుల నమ్మకం.

ఇక్కడున్న భైరవేశ్వరుడు సంతానహీనలకు సంతాన ప్రాప్తిని కలగుగజేసే దైవం. శివరాత్రినాడు పుణ్యస్నానమాచరించి భైరవేశ్వరుని ఆలయ ప్రాంగణంలో నిద్రించిన స్త్రీలకు సంతాన ప్రాప్తి కలుగుతుందని భక్తుల విశ్వాసం.

బ్రహ్మేశ్వర స్వామి తీర్థోత్సవం పుష్యబహుళ అమావాస్యనాడు మరియు భైరవేశ్వరుని తీర్థోత్సవం మాఘశుద్ధ బహుళ చతుర్దశి నాడు ఘనంగా జరుగుతాయి.

- **ఆశయాలతో జీవించేవాడు అందరికన్నా ముందు నడవాలను కుంటాడు. ఆశలతో జీవించేవాడు ముందు నడిచే వారందరినీ తన వెనుకకు నెట్టాలనుకుంటాడు. ఆశయాలతో జీవించే హక్కు అందరికీ వుంది. ఆశలతో జీవించే హక్కు ఏ ఒక్కరికీ లేదు.**

# వివిధ వ్యాధులు - ఆయుర్వేద చికిత్సలు

డా॥ టి. చంద్రశేఖరం, తిరుపతి. 9701181966

(గత సంచిక తరువాయి)

## 5.1. గోవు విశిష్టత

- పవిత్రమైన భరతక్షేత్రములో పూజ్యములగు వస్తువులలో గోమాత ముఖ్యమైనదని వేదకాలము నుండి చెప్పబడినది.

- బ్రహ్మాండ మండలమున అనేక లోకములున్నవి - దేవలోక, పితృలోక, బ్రహ్మలోక, విష్ణులోకములు. వీని కంటే ఊర్ధ్వలోకమైనది గోలోకము.

- రాధాకృష్ణులు గోలోకవానులైయుండి భూలోకమున అవతరించారని, బృందావనము కూడా శ్రీకృష్ణుని అనుమతితో గోలోకమునుండి వచ్చినదని బ్రహ్మవైవర్తన పురాణము నందు చెప్పబడినది.

- పరమపవిత్రమై వెలయు వైదిక కర్మలయందు మొదటి ఉపకరణము గోవు.

సాధుస్వభావానికి ప్రతీకమైన గోవును గోమాతగా భావించి పూజించడం మనకు అనాదిగా వస్తున్న సాంప్రదాయం. నిస్వార్థచింతనను తనలో నింపుకున్న గోవులనుండి లభించే పాలు, పెరుగు, వెన్న, నెయ్యి మన శరీరానికి పుష్టినిచ్చే ఆహారంగా అందరికి చిరపరిచితమైనది. అమృతతులయమైన ఈ ఆహార పదార్థాలు ఆరోగ్యప్రదాలే గాక రోగ నిరోధక శక్తినికూడా ప్రసాదిస్తాయి. ఆవు పాలలో ఉన్న అద్భుతమైన ఔషధ గుణాలు ఎన్నో ప్రాణాంతక వ్యాధులనుండి మనుషులకు రక్షణను కల్పిస్తున్నాయి. మహాభారతం గోవు ప్రాశస్త్యాన్ని తెల్పుతూ ఆవు పాలకన్నా మేలుచేసే పదార్థం వేరొకటి లేదని చెప్పింది.

పూర్వం విద్యాభ్యాసానికై గురువుల ఆశ్రమాలకు వెళ్ళిన శిష్యులు విద్యాభ్యాసంలో భాగంగా గురుసేవతో పాటు గోసేవను కూడా విధిగా చేసేవారు. వేదములకు ప్రతిరూపాలుగా చెప్పబడే గోవులు ధర్మమునకు కూడా ప్రతిరూపాలే. గోసేవ అపారమైన జ్ఞానమును కలుగజేస్తుందని, సకల దేవతారాధన గోసేవ వలననే సాధ్యమౌతుందని పురాణేతిమాసాలు వక్కాణిస్తున్నాయి. ధర్మస్వరూపులైన గోవుల పట్ల మిక్కిలి మక్కువ గలవానిగా శ్రీకృష్ణుడు మనకు తెలియపరుస్తున్నాడు. గోపాలకృష్ణుడుగా, గోవిందునిగా కీర్తించబడే స్వామి మనకు భాగవతంలో దర్శనమిచ్చాడు. గౌతముడు గోమాతకు ప్రదక్షిణం చేసి భూప్రదక్షిణ ఫలాన్ని పొంది అహల్యను భార్యగా దక్కించుకున్నాడు.

గోక్షీరానికి పెరుగు, వెన్న వాటికే గాక గోవు యొక్క మలమూత్రములకు కూడా ఎంతో విశిష్టత ఉన్నది. గోపంచితము (గోవు మూత్రము), గోమయము (ఆవుపేడ), గోదుగ్ధము (ఆవుపాలు) ఔషధాలలో కల్మషాన్ని పోగొట్టి శుద్ధి చేస్తాయి. ఆవుపాలు, పెరుగు, నెయ్యి, గోపంచితం, గోమయం అనే పంచగవ్యంగా వ్యవహరిస్తారు. యజ్ఞ ఫలమును పొందుటకు గోవే కారణమనీ, గోవులోనే యజ్ఞం ప్రతిష్టించబడినదనీ చెప్పబడినది.

పరమపవిత్రమైన గోమాతను సంహరించడం కానీ, గోమాంస భక్షణ చేయుడం కానీ, ఇటువంటి పాపాలను ప్రోత్సహించడం గానీ చేసే వారికి గోవు శరీరంలో ఎన్ని రోమాలున్నాయో అన్ని సంవత్సరాల పాటు నరకం ప్రాప్తిస్తుందని మహాభారతం చెప్తున్నది. మానవులకు ఇహసౌఖ్యములను పొందించేది గోవు.

గోవును రక్షించుట వలన సమస్త ప్రకృతిని రక్షించినట్లు అవుతుంది. ఉదయం నిద్రలేవగానే ముందుగా గోమాతకు నమస్కరించడం మన పూర్వీకులేర్పరచిన సాంప్రదాయం. స్వప్నంలో గోదర్శనం వ్యాధి నివారకంగాను, కళ్యాణకరముగాను చెప్పబడుతున్నది. గోసేవ మానవులకు ఆయురారోగ్య ఐశ్వర్యాలను ప్రసాదించేదిగా చెప్పబడుతున్నది.

- సమస్త దేవతలు గోవు శరీరాన్ని ఆవహించి వుంటారని, గోవుని ఆశ్రయించి భూలోకంలో విహరిస్తారని ప్రతీతి.

- గోవు యొక్క నుదుటి భాగానికి అధిపతి శివుడు. కావున గోవు నుదురును పూజిస్తే కాశీవిశ్వేరుణ్ణి పూజించినంత ఫలితం వస్తుంది.

- గోవు నాసికకు (ముక్కు) సుబ్రహ్మణ్యస్వామి అధిపతి. గోవు నాసికను పూజిస్తే మంచి సంతానము కలుగుతుంది.

- గోవు హ్రీంకారము వింటే దుష్టశక్తులు పారిపోతాయి.

- గోమాత గంగడోలును దువ్వితే ధర్మదేవత శాంతించి సకల ఐశ్వర్యములు ఇస్తుంది.

- గోవు పృష్ఠ అనగా వెనుక భాగము పూజిస్తే నక్షత్ర జనన దోసాలు, ఆర్థిక బాధలు, ఋణబాదలు తొలగిపోతాయి.

- గోవు కర్ణములను (చెవులు) పూజిస్తే మంచి సంతానము కలుగుతుంది.

- అలాంటి గోవును మానవులు దర్శించినా, స్మరించినా, పోషించినా అనంతమైన పుణ్యఫలం లభిస్తుంది.

- క్షీరసాగర మధనంలో ఉద్భవించిన గోమాత, కామధేనువు శ్రీ మహాలక్ష్మికి సోదరి వంటిది.

- వైద్యశాస్త్ర పరంగా గోకీరము, గోవు నెయ్యి గోమూత్రము గొప్ప ఔషధ గుణములను, వ్యాధి నిరోధకశక్తి కలిగించు ఆహారంగా వున్నది.

- యుగయుగాలుగా మన భరత ఖండంలో ఆవును గోమాతగా, విశ్వమాతగా, ఆరోగ్యప్రదాతగా గౌరవిస్తూ, పూజిస్తున్నారు.

- ఆవుపాలు, ఆవు పెరుగు, ఆవు నెయ్యితో దేవతలకు అభిషేకము / నైవేద్యమునకు పనికివచ్చును.

- ఇతర జంతువుల దధి, క్షీరము, ఘృతములు రుద్రాభిషేకము మున్నగు దేవతా కార్యములకు పనికిరావు, నిషేధము.

- పూర్వము భరత ఖండమున లోకకళ్యాణమునకై యజ్ఞములు ఋషుల ద్వారా జరుపబడుచుండెడివి. ఆ యజ్ఞములకు కావలసిన దధి, క్షీరము, ఘృతములకై గోవులను పోషించి, రక్షించుచుండెడివారు. అందులకే వేదకాలమున గోసంపద పుష్కలముగా అభివృద్ధి చెందియుండెను.

- వశిష్టుని దగ్గర వున్న ధేనువునకు హోమధేనువు అని పేరు. ఋషి వాటికలలోని గోవులన్నియు హోమధేనువులే.

- యజ్ఞము శ్రేష్టమగు కర్మ. యజ్ఞ కర్మయందు ప్రధాన దేవత దేవేంద్రుడు. ఆ దేవేంద్రునకు దధి, క్షీర, ఘృతముచే హోమము చేసి సంతృప్తి పరచాలి. ఆ దేవేంద్రుడు మేఘములకు అధిపతి.దేవేంద్రుడు ప్రీతి పొందితే వర్షములు కురిపించును. వర్షముల వలన సకల భూతకోటి సంతృప్తి చెందును.

మన పూర్వీకులు గోవులను విశేషముగా పెంచి, పోషించి జీవించుచుండెడివారు. అందులచే వారు లక్ష్మీవంతులైన, సంతానవంతులై, సంపదగలవారై, బంధుమిత్రు బలగముతో సంతోషముగా జీవనము సాగించేవారు.

# వాస్తు- సైన్సు

.... ఆళ్ళ రామకృష్ణ, రాజేంద్రనగర్, గుంటూరు. 9492464366


## హోటళ్ళు, ఆఫీసుల, విద్యాలయాలు మొదలగు పెద్ద నిర్మాణాలకు వాస్తు - వాటి ఫలితాలు:

సాధారణంగా హోటళ్ళు, ఆఫీసులు, విద్యాలయాలు, పశువుల శాలలు వంటి పెద్దపెద్ద నిర్మాణాలు పొడవు ఎక్కువగా, వెడల్పు తక్కువగా వుంటేటట్లుగా నిర్మించటం జరుగుతుంది. వీటిని శాలలు అనటం పరిపాటి. ఒకే వరసలో, అనేక గదులుగా వచ్చేటట్లుగా భవనాన్ని నిర్మించటమే ఈ శాలల ప్రత్యేకత, ముఖ్య ఉద్దేశ్యం కూడ. దీని వలస స్థలం కలిసి రావడమే కాకుండ, నిర్మాణ వ్యయం కూడ తగ్గుతుంది. ఈ శాలలు నాలుగు రకాలుగా వుంటాయి.

1) ఏకశాల, 2) ద్విశాల, 3) త్రిశాల మరియు 4) చుతుశ్శాలలు.

ఏకశాల : ఏకశాల అనగా పొడవుగా ఒకే వరుసలో నిర్మించబడేటటువంటి భవనము. ఈ ఏకశాలలో అనేక గదులుండవచ్చును లేదా ఒకే హాలు లాగ కూడ ఉండవచ్చు. సాధారణంగా ఎలిమెంటరీ స్కూలు భవనాలను, ఏకశాలలుగా చూడటం జరుగుతుంది. ఇవి వాస్తు ప్రకారము చాలా మంచి నిర్మాణాలు.


ఇవి రెండు రకాలు 1) తూర్పు పడమరల ఏకశాల 2) ఉత్తర దక్షిణాల ఏకశాల.



ద్విశాల : రెండు శాలలు కలిపి 'యల్' ఆకారంలో చేసే నిర్మాణాన్ని ద్విశాల అనటం జరగుతుంది. 'యల్' ఆకారంలో కలిపినపుడు, వచ్చే నిర్మాణాలు, కొన్ని వాస్తుపరంగా, మరికొన్ని వాస్తుకు వ్యతిరేకంగా వుంటాయి. ఈశాన్యాన్ని పెంచుకుంటూ నిర్మించే ద్విశాలలు (అంటే ఉత్తర ఈశాన్యం, తూర్పు ఈశాన్యం పెంచుకుంటూ) మంచి ద్విశాలలుగా పరిగణించబడం జరుగుతుంద. మిగతా వాటిని వాస్తు వరంగా చెడు ద్విశాలలుగా లెక్కగట్టడం జరుగుతుంది.

### మంచి ద్విశాలలు


ఉత్తర ఈశాన్యం పెరిగిన ద్విశాల:




ఉత్తరం


ఈశాన్యం

తూర్పు ఈశాన్యం పెరిగిన ద్విశాల





### చెడు ద్విశాల


వాయవ్యం పెరిగిన ద్విశాల



ద్విశాలలకు పడమర కన్నా, తూర్పున ఎక్కువ ఖాళీ ఉండటం, దక్షిణం కంటే ఉత్తరంలో ఎక్కువగా ఖాళీగా ఉండటం అనే నియమాలను విధిగా పాటించాలి. ఒక నిర్మాణం చతురస్రాకారంగా ఉండాలి లేదా దీర్ఘ చతురస్రాకారంగా ఉండాలి అన్న నియమం ద్విశాలలకు వర్తించదు. ద్విశాలలను 'వి' ఆకారంలో కూడ నిర్మించడం జరుగుతుంది.

**త్రిశాల** : త్రిశాల అంటే మూడు వైపులా భవనం నిర్మించటం అన్న మాట. అంటే మూడు శాలలు కలిపి ఒకే భవనంగా నిర్మించటం. వీటిలో కొన్ని మంచివి, కొన్ని చెడువి వున్నాయి. ఇవి 'యు' ఆకారంలో ఉంటాయి.




**ఇవి రెండు రకాలు**


1) పడమర గోడకు సమాంతరంగా ఉండే ద్విశాల

2) దక్షిణం గోడకు సమాంతరంగా ఉండే ద్విశాల

నిర్మాణంలో తప్పని సరిగా పడమర కంటే తూర్పు, దక్షిణం కంటే ఉత్తరంతో, అన్ని శాలలకు ఎక్కువ స్థలం ఉండేటట్లుగా చూసుకోవాలి.

**చతుశ్శాలలు** :

చతుశ్శాలలు అంటే, నాలుగు శాలలు కలిసి చతురస్రాకారంగా గాని, దీర్ఘచతుర స్రాకారంగా కాని నిర్మించబడే భవనము. ఇదిచాల మంచి నిర్మాణం.



చతుశ్శాలలోని, నాలుగు శాలలు, నాలుగు దిక్కులకు సమాంతరంగా ఉండాలి. పూర్వకాలపు మండుగా లోగిళ్ళు అన్నీ చతుశ్శాలలే. ప్రస్తుతం, పెద్దపెద్ద ఆసుపత్రి భవనాలు, కళాశాలల వసతి గృహాలు, చతుశ్శాలలలాగానే నిర్మిస్తున్నారు. దీని వలన స్థలం కలిసి రావడమే కాకుండ, అన్ని గదులుకు, గాలి, వెలుతురు పుష్కలంగా ఉండటం జరుగుతుంది. మధ్యలో ఉన్న ఖాళీ స్థలానికి అవసరమనిస్తే కప్పుకూడ వేసికోవచ్చు.

పైన ఉదహరించిన అన్ని రకాల భవన సముదాయాలనీ కూడ వాస్తు ప్రకారము నిర్మించుకోవాలి. ఆ విషయాలను తదుపరి సంచికలో తెలుసుకుందాం.

సర్వేజనా స్సుఖినోభవంతు.

## పాఠకులకు మనవి

ప్రియ పరిపూర్ణాత్మ బంధువులైన **కాలజ్ఞానసుధ** పాఠకులకు విజ్ఞప్తి. ముద్రణ మరియు పేపరు ధర పెరిగినందువలన **2015 అక్టోబరు** నెల నుండి

**విడి ప్రతి : రు. 10/-**

**సంవత్సర చందా : రు. 100/-**

**లుగా** పెంచడమైనది. కనుక పాఠకులు గమనించ గలరు.

**గమనిక :** పాఠకులకు నెల మొదటి వారములో పత్రిక చేరని యెడల ఫోన్ చేసి తెలుపగలరు.

**సెల్ : 99491 32469**